

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 12 | సంచిక : 5 | జనవరి 2007

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 28**

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**చందా**

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా

**రమణ భాస్కర**

శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


**ఈ సంచికలో....**


అరుణాచలం ..... 03-10-06

జువ్వలపాలెం..... 13-11-06

జిన్నూరు............ 12-12-06



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## సద్గురు శ్రీ నాన్న ధ్యాన శ్లోకం

"సదా చిరుదరహాస పూరితం వదనమ్

శాంతం సుఖదం స్వరూపమ్

అభీష్టవర ప్రదం సద్గురు సన్నిదిమ్

తత్వార్ధ విచారఘోర తిమిర భాస్కరం ప్రవచనమ్

శుద్ధ సత్వో గుణోపేతమ్

తమ్ గురుమ్ నాన్నగారు ప్రణమామ్యహమ్॥

## కువైట్‌లో స్వాగతం

అదో అరుదైన సాయంత్రం...... ఎడారి బడి
అసుర సంధ్య వేళకి ఆహ్వానంపై అటుగా వెళ్ళి
భగవద్గీత, బైబిల్, ఖురాన్ కూడ కూడబలుక్కొని వచ్చాయి
మాయామయ జగత్తున తోవచూపే తేజోమయ రూపం తెచ్చాయి.

ప్రేమకు ప్రాణం పోసి పంచె కట్టి నట్టుందేమిటి ఆ రూపం?
చూపుల్లో ఆ ఆర్ధ్రత ఏమిటి కడుగుతున్నట్లుగా మన పాపం?
ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూస్తున్న ఆత్మ బంధువులా వీరు?
ఎడారుల్లో ఏకాకులమని వోదార్చవచ్చినట్టుంది వారి తీరు.

పలుకు పంచదారలా ఉందేమిటి చిత్రంగా
జ్ఞానం ప్రతిఫలిస్తూ ఆ వర్చస్సేమిటి పవిత్రంగా
అమృతధార అనుభవానికొస్తుందేమిటి గాత్రంలో

సరే చూద్దాం.... అద్భుతానుభవాల ఆవలి తీరం ఎక్కడో..... అనుకుంటూండగానే

ప్రవచన గంగ పొంగింది......

నగర స్మశాన సమానమైన మ మనస్సుల మీదుగా....

పునీతమే ప్రయోజనంగా పుణ్యమే పంచగా..... గంగ

కరుణామృత దృక్కులు దశదిశలా ప్రసరించాయి

అమృతవాక్కులు శ్రవణ పేయంగా వినిపించాయి

శ్రద్ధతో కూడిన నిశ్శబ్ధం మాధ్యమంగా పయనించాయి

మనసుల్ని లలితంతా సునిశితంగా స్పృశించాయి.

మాతృభాష మంచిమాట, మనసు మాట స్వాంతన కూర్చింది

అత్యంత అవసరమైన ఆధ్యాత్మిక దాహార్తిని తీర్చింది

అక్కడ అద్వైతం అవతారం వెలిసింది.

కాలం కుర్రాడు రెండు రౌండ్లు తిరిగొచ్చాడు

రమణ మహర్షులు ఇక్కడే తచ్చాడుతున్నట్లు చెప్పాడు

చడీచప్పుడు లేదు అక్కడంతా గుండె చప్పుడే

అసలే అరిచే పిల్లాడు సైతం అల్లరి మరిచాడు

మదిగదిలో మనసువాడు సరిక్రొత్త పేజీ తెరిచాడు

ఆ పేజీలో తేజోమయ రూపం శాశ్వత ముద్ర పడింది

అనుసరించి చేసింది ఆత్మీయ సంతకం “నాన్నగారు” అని.

మహిషంలాంటి మనసుల్ని మార్చగల మనీషి

పూర్వ జన్మకృతం వల్ల పునీతం చేయవచ్చిన ఋషి

పశ్చిమ గోదావరి పుష్కలంగా ఆహారం పండిస్తుంది

జిన్నూరు మాత్రం జీవితాల్ని పండిస్తుంది

సార్థక నామధేయులు శ్రీ నాన్నగారు

ప్రేమ ఆప్యాయతలకు అన్నగారు

ఎవరండీ ఈ సుజాత.....

అరె... సుజాత అంటేనే మంచి పుట్టుక పుట్టడం అని ఒక అర్థం.
అది చాలక పుణ్యం పోగేసుకుంటున్నట్టు ఈవిడ
తుంటరి ఒంటెల (ఇక్కడి మనుషులు) తోకలట్టుకొని
ఉన్న ఊళ్ళో ఉనికిని కోల్పోయి
ఏదో అలా ఎడారుల్లో మత్తులో మందల్లా బ్రతికేస్తుంటే
ఈమెకెందుకండీ మన బాగుకై ఆత్రుత
అవలోకిస్తే అర్థమైంది సాయపడడంలోని సార్థకత.........
జ్ఞాన సూర్యుణ్ణి ఆమె అపురూపంగా తెచ్చిందనుకోండి
ఆ వెలుగుల్ని పదిమందికి పంచాలనుందా ఎక్కడన్నా
గొట్టుముక్కల అప్పల నరశింహం?
ఏమిటయ్యా నీ తపన.... తపస్సా.... పట్టుదల తోబుట్టువుగా పుట్టిన మనస్సు
మంచిని పదిమందికి పంచడమేనా నీ పని
ఒంటి చేత్తో వందలమందిని రప్పించడం నీ సమర్థతకు నిదర్శనం....
చేయించావు కదా జ్ఞాన సూర్యుని దర్శనం....
కృతజ్ఞతలతో... మానసికోద్వేగాన్ని మాటలుగా మారుస్తూ..... ఇలా

**– పెండ్యాల వెంకటేశ్వరరావు**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 3-10-2006, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అహంకారం స్థూలరూపంలో ఉంటుంది, సూక్ష్మరూపంలో కూడా ఉంటుంది. స్థూల రూపంలో ఉన్నది మనకు తెలుస్తూ ఉంటుంది. దానిని తొలగించుకోవటం తేలికేకాని సూక్ష్మరూపంలో ఉన్నదానిని తొలగించుకోవటం కష్టం, సూక్ష్మరూపంలో ఉన్నది కూడా తొలగింపబడితేగాని అమృతానుభవం కలుగదు. ఈ రోజున మనం అందరం అరుణాచలేశ్వరుడి నీడలో ఉన్నాము. మీరందరూ చాలా అదృష్టవంతులు. మీ తెలివితేటల వలన మీరు ఇక్కడకు వచ్చారు అని నేను అనుకోవటం లేదు. పూర్వజన్మలో మీరు చేసిన పుణ్యకర్మల ఫలితంగా అరుణాచలేశ్వరుడి చేత ఆకర్షింపబడి మీరంతా ఇక్కడకు వచ్చారు. భగవంతుడిచేత

ఆకర్షింపబడితే, ఆయన దయవలన మనకు భగవదనుభవం కలుగుతుంది కాని కేవలము మన ప్రయత్నం వలన భగవదనుభవం పొందలేము. అయితే వ్యక్తిభావన ఉన్నంతకాలం మనం ప్రయత్నం చేయకుండా ఉండలేము, ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉంటాము.

ఏనాటి పుణ్యమో, ఏనాటి అనుబంధమో ఈ మహాక్షేత్రం మిమ్మల్నందరినీ ఇక్కడకు తీసుకొని వచ్చింది. ఒక జన్మ ముందైనా, ఒక జన్మ వెనకాల అయినా కూడా మీరందరూ అమృతానుభవం పొందుతారు. అందులో సందేహంలేదు. మీరు సందేహపడవద్దు. సందేహ పడితే దుమ్ము, సందేహరహితంగా ఉంటే సొమ్ము. మీకందరికీ అమృతానుభవం పొందే అర్హత, యోగ్యత ఉంది కాబట్టే ఈ మహాక్షేత్రానికి మీరందరు విచ్చేయటం జరిగింది. మీకా సుకృతం లేకపోతే మీరు ఇక్కడకు వచ్చే అవకాశం లేదు. ఇక్కడ కొండపేరు అరుణాచలం, ఊరుపేరు అరుణాచలం, ఇక్కడ ఉన్న దేవుడి పేరు అరుణాచలం, అంతా అరుణాచలమే. ఈ క్షేత్రంలో గుడిలో ఉన్న దేవుడికంటే గిరిరూపానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. గిరి రూపమైనా ఆయనే, గురు రూపమైనా ఆయనే, అన్ని రూపాలు ఆయనే. ఈ క్షేత్రం గురించి వివరంగా అధ్యయనం చేయాలంటే స్కాంధపురాణంలో చాలా వివరంగా ఉంది. మీకు, నాకు, ఇక్కడ కూర్చొన్న వారందరికి కూడా ఇది ఒక కొండ, ఒక రాళ్ళగుట్ట. కాని రమణస్వామికి ఇది కొండకాదు, ఇది రాళ్ళగుట్టకాదు, సాక్షాత్తు భగవంతుడే, సాక్షాత్తు ఈశ్వరుడే. ఎప్పుడో ఆయన చిన్నప్పుడు ఎవరో చెపితే అరుణాచలం పేరు విన్నారు, అరుణాచలం పేరు విన్నప్పుడు అది ఒక ఊరు అని ఆయనకు స్ఫురించలేదు, అరుణాచలం అనగానే భగవంతుడు ఆయనకు స్ఫురించాడు, అది జన్మాంతర అనుబంధం. అరుణాచలేశ్వరుడి మీద దేవుడు అనే భావన కంటే తండ్రి అనే భావన ఆయనకుండేది. ఆయన తండ్రి అని మనం బిడ్డలం అని ప్రస్తుతం అనుకోవచ్చు. రమణమహర్షికి ఆ కొండమీద జనకభావన ఎలా ఉండేదో అలా ఏసుక్రీస్తుకు యెహోవా పట్ల జనకభావన ఉండేది. ఆయనను శిలువ వేసినప్పుడు ఆ శారీరకబాధ భరించలేక ఓ తండ్రీ! నన్ను మర్చిపోయావా? అన్నాడు. ఆయనకు అద్వైతానుభవం కలిగాక ఏమిటి నేను ఇలా మాట్లాడుతున్నాను, నాకంటే వేరుగా ఉన్నాడు నా తండ్రి అని ప్రార్థిస్తున్నాను. ఇంతకాలం నేను వేరు, నా తండ్రి వేరు అనుకొన్నాను. ఇప్పుడు నా తండ్రి వేరు, నేను వేరు కాదు అని నాకు తెలుస్తోంది అన్నాడు ఆయన, ఆయన తండ్రి ఒక్కటే అనేటువంటి అద్వైతానుభవాన్ని, అమృతానుభవాన్ని ఆ శిలువ మీద ఆయనకు యెహోవా అనుగ్రహించాడు. అరుణాచలేశ్వరుడి అనుగ్రహం లేకుండా మనకు అద్వైతానుభవం కలుగదు. ఆయన

అనుగ్రహం వలన అద్వైతానుభవం కలిగాక ఆయన, మనం ఒక్కటే, ఇంక ద్వితీయం లేదు అని అప్పుడు మనకు తెలుస్తుంది.

సోదర మహాశయులారా! మీలో ధనవంతులు ఉండవచ్చు, పండితులు ఉండవచ్చు, మంత్రులు ఉండవచ్చు కాని ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి. ఒకసారి ప్రపంచం యొక్క చరిత్ర చూస్తే ఎవడో ఒక రమణుడు, రామకృష్ణుడు, మహ్మద్, క్రీస్తు, బుద్ధుడు ఇటువంటివారే ఈ ప్రపంచానికి సారమయి ఉన్నారు. పప్పుకు ఉప్పు ఎటువంటిదో మనకు కనిపిస్తున్న ఈ ప్రపంచానికి వీరు సారమయి ఉన్నారు కాని పండితులు, ధనవంతులు కాదు. ఆత్మ స్వరూపులైన మహాశయులారా! ఇతరులకు మీరు ఉపయోగపడాలి అనుకొంటే, ఈ సృష్టికి మీరు ఉపయోగపడాలి అనుకొంటే అమృతానుభవం పొందకుండా, అద్వైతానుభవం పొందకుండా మీరు ఈ సృష్టికి ఏ రకంగాను ఉపయోగపడలేరు. ఏదో మాకు ధనం ఉంది ఇక్కడ పది రూపాయలు ఇచ్చాము, అక్కడ అయిదు రూపాయలు ఇచ్చాము అంటే ఇవన్నీ సెకండరీ. అలానే మీకు పాండిత్యం ఉంటే పదిమందికి చదువు చెప్పవచ్చు. ఇవన్నీ కూడా రెండవ పక్షం. సత్యానుభవం పొందటం ద్వారానే ఈ సృష్టికి ఏమైనా జరుగుతుంది కాని మిగతావి అన్నీ కూడా స్వప్న సమానమే. ఆత్మానుభవం పొందాక ఎవరికైనా సహాయం చేద్దాము అంటే ఇతరులు మిగలరు, ఎందుచేతనంటే ఇప్పుడు మనం ఎవరికైనా సహాయం చేస్తే వారికి ఎంతో సహాయం చేసాము అని అనుకొంటాము అంటే దేహభావనకు ఇతరులు ఉన్నారు కాని ఆత్మభావనకు ఇతరులు లేరు. ఎవడైతే అమృతస్థితిని పొందాడో వాడి ద్వారా శాంతి తరంగాలు, కాంతి తరంగాలు వచ్చి ఈ సృష్టిని కప్పుతూ ఉంటాయి కాని తన ద్వారా ఈ సృష్టికి ఇంత జరుగుతోంది అని వాడికి తెలియదు ఎందుచేతనంటే వాడికి లోకం లేదు, మనస్సు గొడవ, శరీరం గొడవ వాడికి లేదు. నేను ఎవరినో ఉద్ధరిస్తున్నాను అనుకొనే వాడు అక్కడలేడు, అలా అనుకొనే వాడు అక్కడ ఉంటే వాడికి జ్ఞానం లేదు.

క్షరం అంటే నశించేది. అక్షరం అంటే నాశనం లేనిది. ఆ అక్షరంలో మనలను ఐక్యం చేసేదే అక్షరమణమాల. ఇతరులు ఏదైనా అడిగితే చెప్పటంకాని ఆయన అంతట ఆయన మాట్లాడే అలవాటు రమణస్వామికి తక్కువ. ఆత్మ యొక్క భాష మౌనం, అందుచేత ఆయన చేయవలసింది ఏదో మౌనం ద్వారానే జరిగిపోయేది. అంతా మౌనం ద్వారా జరిగిపోతూ ఉంటే మాటలు ఎందుకు? దేహంతో తాదాత్మ్యం పొందే తలంపే పాపం, అంతకంటే మించిన పాపం లేదు. దానిని శిలువ వేస్తే నీకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది.

ఏసు శిలువ వేయబడ్డాడు అంటే అక్కడ శరీరానికి శిలువ వేయటంకాదు, దేహభావనకు శిలువ వేయాలి. నువ్వు చచ్చిపో, నువ్వు చచ్చిపో అని మనస్సును అడిగితే అది చనిపోతుందా? చనిపోదు. ఆత్మానుభవం పొందటానికి మనకు ఏదైతే అడ్డువస్తోందో దానిని నువ్వు చచ్చిపో అంటే అది చనిపోదు. ఈశ్వరానుగ్రహం లేకుండా అది సాధ్యం కాదు. అదే భగవాన్ చెప్పారు ఏనుగు ఒక్క సింహానికి మాత్రమే లొంగుతుంది. అలాగే నీ మనస్సు అనే ఏనుగుకు గురువు అనుగ్రహం సింహం లాంటిది. అందుచేత గురువు అనుగ్రహం సహాయంతో ఈ మనస్సును, దేహభావనను తొలగించుకోగలము కాని వేరే మార్గం లేదు అని చెప్పారు. గురువు అనుగ్రహం లేకుండా మనకు ఆత్మజ్ఞానం లభ్యంకాదు, ఒకవేళ మీరు చాలా గట్టికారులు అని మీరు అనుకొన్నా అది మీకు సాధ్యం కాదు. మీకు ఏదో డబ్బు ఉంటుంది, సమాజంలో గౌరవం ఉంటుంది, ఎక్కడో స్కూలు కట్టిస్తారు, నుయ్యి తవ్విస్తారు, వాటితో మీరు తాదాత్మ్యం పొందుతారు. మీలో ఏదో ప్రత్యేకత ఉందని ఊహించుకొంటారు, ఇదంతా సున్న అని మీకు తెలియదు. అరుణాచలం అగ్నిలింగం. ఇక్కడ మీ అహంభావన అంటుకొంది, అది పూర్తిగా తగలబడటానికి కొంత టైము పడుతుంది కాని జ్ఞానం రావటం రావటమే, అందులో సందేహం లేదు. ఈశ్వరుడు వేరు, నేను వేరు అనేది ద్వైతభక్తి. ఈశ్వరానుగ్రహం లేకుండా ఆయనా, నేను ఒక్కటే అనే అనుభవం మనకు కలుగదు. ఒకో మనిషికి ఒకో స్వభావం ఉంటుంది. ఆ స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం. ఈశ్వరుని దయ లేకుండా కేవలం మన ప్రయత్నం వలన మన స్వభావం మారదు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది. దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం ఉండటం. అది నీ ఇంద్రియాలకు, మనస్సుకు ఒక ఆబ్జెక్టు కాదు, అందుచేత నీవు దానిని తెలుసుకోలేకపోతున్నావు. నీకు తెలియనంత మాత్రం చేత ఉన్నది లేకుండా పోదు. నా హృదయంలో ఉన్న నిజస్థితిలో నేను ఉండలేకపోవటానికి నాలో ఉన్న చెడు అలవాట్లు, చెడు ఆలోచన, నాలో ఉన్న వేరుభావన కారణం. ఇది అంతా నా మనస్సులో ఉన్న కుట్ర అవ్వవచ్చు. ఆ కుట్రను బయటకు తీసి కాల్చి బూడిద చెయ్యి అరుణాచలా! నాలో ఉన్న చెడు అలవాట్లు తీసేస్తే సరిపోదు మంచి అలవాట్లతో నన్ను అలంకరించు. అది గురువుగా నీవు చెయ్యవలసిన బాధ్యత అంటున్నారు భగవాన్ అరుణాచలేశ్వరుడితో.

అజ్ఞానంలో నుండి దుఃఖం వస్తుంది, జ్ఞానంలో నుండి సుఖం వస్తుంది. ఈ సృష్టిలో

నిజమైన సుఖి ఎవరంటే ఒక్క జ్ఞాని మాత్రమే నిజమైన సుఖి. లక్ష కోట్లు డబ్బు సంపాదించిన వాడు కూడా వాడి శరీరానికి చావు వచ్చినప్పుడు ఏడుస్తాడు. ఎందుకు ఏడుస్తాడు అంటే ఏదో డబ్బు అయితే సంపాదించాడు కాని వాడు నిజస్థితిలో లేడు. శరీరం పోయినప్పుడు కూడా జ్ఞాని సుఖంగానే ఉంటాడు. ఎందుచేతనంటే తనువు తానుకాదని వాడికి తెలుసు. ఆ శరీరం పోతున్నప్పటికి తన అస్థిత్వానికి ఇసుమంతయు భంగం లేదని వాడికి తెలుస్తుంది, అందుచేత వాడు దుఃఖరహితుడిగా ఉంటాడు.

గిరిప్రదక్షిణ చేసేవారికి వారు ఏదైనా అడిగితే అడిగింది మటుకే ఇచ్చి ఊరుకుంటాడు, అడగనివారికి అన్నీ ఇచ్చి నిర్వాణసుఖాన్ని కూడా ఇస్తాడు. మన నోరు అడగటానికి అలవాటు అయిపోయింది. ఏదో ఒకటి అడుగుతూ ఉంటాము. మనం ఏదీ అడక్కుండా ఉంటే మనకు ఏది అవసరమో, మనకు ఏది మంచిదో చూసుకొని ఆయనే ఇస్తాడు. ఆ విషయం మనకు తెలియక ఏదో ఒకటి అడిగేస్తున్నాము. మనం అడిగినది ఇచ్చేస్తాడు అక్కడితో ఆయన అనుగ్రహం ఆగిపోతుంది. అందుచేత మీరు గిరిప్రదక్షిణ చేసేటప్పుడు ఆ కోరిక, ఈ కోరిక లేకుండా ఆయనను స్మరించుకొంటూ రేపు పురుడు వచ్చే అమ్మాయి ఎంత జాగ్రత్తగా, ఎంత స్లోగా నడుస్తుందో గిరి ప్రదక్షిణ చేసేవారు అంత స్లోగా నడవాలి. అందరూ ఒకటే పరుగులు, మీకు కావలసింది లెక్కగాని భక్తికాదు. మీ కూడా జనం ఉంటారు. ఏదో బాతాఖానీ గొడవలు చెపుతారు. ఆ గొడవలు వదిలెయ్యండి. ఒకవేళ ఎవరైనా లోకం గొడవలు చెపుతూ వుంటే వారిని నోరు మూసుకోమని చెప్పండి, లేకపోతే వారిని వదిలించుకోండి. భీమవరం గొడవలు, రాజమండ్రి గొడవలు గిరిప్రదక్షిణ చేసేటప్పుడు ఎందుకు? ఆ గొడవలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు చూసుకోండి. ఇక్కడకు వచ్చి ఆ గొడవలు ఏమిటి? ఇది ఎలా ఉంటుంది అంటే డాక్టరుగారు నేను వైద్యం బాగానే చేసాను కాని పేషెంటు చనిపోయాడు అని చెప్పినట్లుగా ఉంది. మనం చేసే ప్రదక్షణాలు అలాగే ఉన్నాయి.

ఆత్మను ఎలా ధ్యానం చెయ్యాలి అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఉన్నది అదే, అది తప్పించి ఏదీ లేదు అనుకొని ధ్యానం చెయ్యి, నీకు రిజల్టు పాజిటివ్‌గా ఉంటుంది. నువ్వు అనుకొన్నట్లుగా అది లేదు, అది ఎలా ఉండాలో అలాగే ఉంది, అలా ధ్యానం చెయ్యి. అరుణాచలేశ్వరుడు దయాస్వరూపుడు, కరుణాస్వరూపుడు. ఆయన చేసింది మీకు ఒకోసారి ఇష్టం లేకపోవచ్చు. ఆయన నాకు మంచి చేసాడు అని తరువాత నీకు తెలుస్తుంది. అరుణాచలేశ్వరుడు ఇంతటివాడా, పురాణాలు కూడా ఆయన గురించి సరిగా వ్రాయలేక

పోయినాయి అని అప్పడు నీకు అనిపిస్తుంది. ఇలా జరిగితే బాగుండును అని నేను అనుకొన్నాను, అలా చెయ్యకుండా ఇంకో రకంగా చేసాడు. నాకేది మంచిదో నాకంటే ఆయనకే బాగా తెలుసు అని అది నీకు అనుభవంలోనికి వచ్చాక తెలుస్తుంది. కొంతమంది ఏదైనా ఇస్తాను అంటారు అనుకోండి, నిజంగా తరువాత ఇవ్వలేకపోతే అప్పలు చేసి ఇచ్చిన వారిని నేను చూసాను. అది గివింగ్ హేబిట్, అది పుట్టుకతో రావలసిందే. అది కర్ణుడికి ఉంది. ఒకసారి కృష్ణుడు అర్జునుడితో అంటాడు కర్ణుడు ఏదో దుర్యోధనుడి తరపున యుద్ధం చేయవచ్చును కాని వాడిలో ఉన్న గుడ్ క్వాలిటీ, ఆ గ్రేట్ క్వాలిటీని మిస్ అవ్వకూడదు అంటాడు. అందుచేత కృష్ణుడు దేవుడు అయ్యాడు, ఆయన చూపులో బేధం లేదు, ఆ గ్రేట్ క్వాలిటీని మనం చూడలేకపోతున్నాము అనుకో మనలో కళ్యాణగుణాలు లేనట్లు గుర్తు.

అరుణాచలేశ్వరుడికి ఒక కీర్తి ఉంది. ఎవరిచేత ఏమీ అడిగించుకోకుండా ఎవరికి ఏది ఎప్పడు ఇవ్వాలో అది ఇస్తూ ఉంటాడు. అడిగించుకొనే స్వభావం ఆయనకు లేదు. ఒకవేళ మీకు చెడు అలవాట్లు ఉన్నాయి అనుకోండి. మీరు డబ్బు అడుగుతారు అనుకోండి, అప్పడు ఇవ్వడు, ఆపు చేస్తాడు. అప్పడు అరుణాచలేశ్వరుడిని మీరు పట్టుకొని తిట్టేస్తూ ఉంటారు. ముందు మీలో ఉన్న చెడు అలవాట్లను తీసేసి అప్పడు డబ్బు ఇస్తాడు. ముందుగా ఇస్తే ఆ చెడు అలవాట్లు పెంచేస్తారు. ఎవరినీ ఏమీ అడిగించుకోకుండా ఇచ్చే అలవాటు నీకు ఉంది, లోకంలో ఆ కీర్తి ఉంది, కాని నా విషయంలో నా చేత అడిగించుకొంటేగాని ఇవ్వవు అనుకో దానివలన నా గౌరవానికి ఏమీ భంగం లేదు, నీ అంతస్థుకే, నీ గౌరవానికే భంగం అంటున్నారు భగవాన్. భీష్ముడిని చంపటానికి కృష్ణుడు రథచక్రం ముక్క పట్టుకొని పరుగెడతాడు. అప్పడు అర్జునుడు రథం దిగిపోయి అడ్డుపడతాడు. నువ్వు యుద్ధం చేయనని ఇక్కడకు వచ్చావు, ఇప్పడు ఆడిన మాట తప్పతున్నావు, నీకు అపకీర్తి వస్తుంది, నీ గౌరవానికి భంగం వస్తుంది అంటాడు. పాండవులు చనిపోయి, ఈ సైన్యం చనిపోయి, మీరందరూ చనిపోయాక నేను ఈ గౌరవాన్ని మూటకట్టుకొని ఏమి చేసుకొంటాను అంటాడు, వాడు దేవుడు. గౌరవం, అగౌరవం ఇవన్నీ జీవలక్షణాలు, దేవుడికి గౌరవం ఏమిటి? అగౌరవం ఏమిటి?

డబ్బు మీద కాంక్ష పోయిన తరువాత కూడ, ఇంద్రియ భోగాల మీద కాంక్ష పోయిన తరువాత కూడా మనిషి చనిపోయే వరకు కీర్తి కాంక్ష పీడిస్తుంది అన్నాడు మిల్టన్. నాపేరు అందరికీ తెలిసిపోవాలి, నేను ఎంతో పాపులర్ అయిపోవాలి అని కొంతమంది అనుకొంటూ

ఉంటారు. అమృతానుభవం పొందటానికి కీర్తికాంక్ష కూడా మనకు విపరీతంగా అడ్డు వస్తుంది. ఓ అరుణాచలేశ్వరుడా! అడగకుండానే ఇచ్చే అలవాటు నీకు ఉంది, నా విషయంలో నాచేత అడిగించుకొని ఇవ్వటంకాదు, నాచేత ఏమీ అడిగించుకోకుండా, నా కోరికతో సంబంధం లేకుండా నాకు చెయ్యవలసింది ఏదో చెయ్యి అంటున్నారు భగవాన్. తల్లితండ్రులు మీకు బట్టలు ఇస్తారు, బంగారం ఉంటే ఇస్తారు, అన్నం పెడతారు, శరీరానికి ఏదైనా అనారోగ్యం వస్తే హాస్పటల్‌కు తీసుకొని వెళతారు. ఇవన్నీ చేసేటప్పుడు ఏదో పెద్ద వాళ్లము అయ్యాక మనలను బాగా చూస్తారు అనే భ్రాంతి వారికి లోపల ఉంటుంది. పిల్లలు తరువాత చూసినా చూడకపోయినా తరువాత మనలను బాగా చూస్తారు అనే భ్రాంతిని భగవంతుడు క్రియేట్ చేస్తాడు. వారు చూడరు అని తెలిస్తే చిన్నప్పడే వారిని వదిలేస్తారు. గాంధీగారు ఏమి చెప్పారు అంటే నేను దగ్గరే ఉన్నాను, నాన్నగారు ఇంకో గంటకు చనిపోతున్నారు. అయ్యో మనకు కష్టపడి చదువు చెప్పించారు, ఇంత బాగా చూసారు అని అటువంటి తలంపులు నాకు రావాలి. అప్పడు కూడా నా పెళ్ళాం జ్ఞాపకం వస్తోంది కాని నాన్నగారి బాధ నాకు గుర్తురావటం లేదు అంటాడు బాపూజీ. ఆయన మైండ్ గురించి ఆయన కరెక్టుగా చెపుతాడు. ఇవన్నీ జ్ఞాపకం వచ్చి ఓరామా! శ్రీరామా! నాకు మరల జన్మ రాకపోతే ఇబ్బంది లేదు, ఒకవేళ జన్మంటూ వస్తే పెళ్ళి లేకుండా చూడు రామా! అంటాడు బాపూజీ. భౌతికంగా ఆలోచిస్తే అన్ని ప్రేమలకంటే తల్లి ప్రేమ గొప్పది. అందుకే చెడ్డపిల్లలు ఉంటారుగాని చెడ్డతల్లి ఉండదు అని చెపుతారు. మీరందరూ ఆ అబ్బాయి మంచివాడు కాదు అని అనుకొన్నా మా అబ్బాయి మంచివాడే అని తల్లి చెబుతుంది. తల్లి నేత్రాలకు ఆ అబ్బాయి మంచివాడికిందే కనబడతాడు, అది తల్లి ప్రేమ.

ఓ అరుణాచలేశ్వరుడా! నేను ఎక్కడో చదువుకొనే పిల్లవాడిని, టీనేజ్‌లో ఉన్నాను, నాకు జపం లేదు, తపస్సు లేదు, సాధన లేదు, మరణం లేని వస్తువు ఒకటి ఉందని కూడా నాకు తెలియదు. దాని గురించి నేను చదువలేదు, శ్రవణం చేయలేదు, అసలు ఆ వస్తువు ఉందని తెలియకుండా ఆ వస్తువుతో తాదాత్మ్యం కలుగచేసావు. దేహానికి మరణం చూపించి మరణం లేని వస్తువుతో ఏకం చేసావు, మృత్యువు ద్వారా మరణంలేని స్థితిని పొందింప చేసావు. నీ అనుగ్రహం, దయ ఇట్టిదని నేను ఎలా చెప్పగలను. భౌతికంగా చూస్తే తల్లి ప్రేమ గొప్పదే. కాని నీ ప్రేమతో పోల్చినప్పడు తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమ కాదు. అటువంటి ప్రేమను, కరుణను నా మీద వర్షింపచేసి తల్లి ప్రేమను కూడా మర్చిపోయేటట్లు చేసావు. నీ ప్రేమ ద్వారా నాకు అద్వైతానుభవం కలిగింది, నాకు జ్ఞానం వచ్చేసింది. ఇట్టిదా నీ ప్రేమ

యొక్క వైభవం అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. అరుణాచలం వచ్చేటప్పుడు ఎవరితో అయినా చెప్పి వద్దాము అనే తలంపు కూడా నాకు రాలేదు. నా జీవలక్షణాలు అన్నీ తీసుకొన్నావు, నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు. నా దేహభావనను ఊడగొట్టావు, నా కోరికతో సంబంధం లేకుండా జ్ఞానశిఖరాలకు చేర్చావు. గురువు అనుగ్రహంలో పడితే ఆయన ఏ స్థితిని అయితే పొందాడో ఆ స్థితిని మీరు పొందేవరకూ ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు. మీరు ఈ శరీరం మరణించి కొత్తజన్మలోనికి వెళ్ళినా మీరు ఎక్కడ ఉన్నారో గురువుకు తెలుసు, మీ కోసం ఆయన శరీరం ధరించి వచ్చి, మీతో కలిసి తిరుగుతూ, మీతో మాట్లాడుతూ ఎప్పడో సడన్‌గా మీ మనస్సును అంతర్ముఖం చేసి వదిలేస్తాడు, అప్పుడు మీరు లోపల ఉన్న అంతస్థును, జ్ఞానశిఖరాలను అందుకొంటారు. వాడే గురువు. అక్కడ మీ ప్రయత్నంతో సంబంధం లేదు. కోరికతో సంబంధం లేదు. జన్మాంతర అనుబంధం మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చింది. ఏ జన్మాంతర అనుబంధం అయితే మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని వచ్చిందో ఆ అనుబంధమే మీకు అమృతానుభవం కలిగే వరకూ మిమ్మల్ని వెంటాడుతుంది, వాడు అరుణాచలేశ్వరుడు.

ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారు ఎవరు ఇది నీ జాలము అరుణాచలా! ఇతరులు అంటూ అసలు లేరు. ఉన్నది నీవు ఒక్కడివే. ఇదంతా నీ జాలము, ఇదంతా నీ మాయ. ఇదంతా నిజంకాదు నిజంవలె కనిపిస్తోంది. జ్ఞానం మాట తరువాత చూద్దాము ముందు భగవాన్ టీచింగ్‌లో ఉన్న సౌందర్యాన్ని అందుకోండి. ఉష అసలు లేదు, కాని ఉష ఉందని అనుకొంటోంది. ఆ అనుకొనేది ఎవరు? భగవంతుడిని విడిచిపెట్టి ఉష అంటూ లేదు. భగవంతుడిని విడిచిపెట్టి ఉష అంటూ ఉంటే, ఉష ఎవరు? ఇక్కడ ఉంది టీచింగ్ వైభవం అంతా. దానిని కొంచం విచారణలో పెడితే ఇప్పడే ఇక్కడే నీకు అమృతానుభవం కలుగుతుంది. అరుణాచలేశ్వరుడు తీసుకొని వస్తే మీరు ఇక్కడకు వచ్చారు కాని మీ అంతట మీరు వచ్చామని అనుకోవద్దు ఎందుచేతనంటే మీరు అంటూ అసలు లేరు. మీకు అందరికి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా, అమృతానుభవం పొందాలి అనే కోరిక మీకు ఉన్నా, మీకు లేకపోయినా మీకు అమృతానుభవం పొందే యోగ్యత ఉంది కాబట్టే ఈ రోజున మీరందరు అరుణాచలం వచ్చారు. అదేమిటండీ అమృతస్థితిని పొందాలని మాకేమీ లేదు అని మీరు అనవచ్చు. ఆ స్థితిని పొందాలనే తలంపు లేకుండా దానిని మీరు పొందుతారు. అది రమణానుగ్రహం.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-11-2006, జువ్వలపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన సాంప్రదాయాలను మనం పోషించుకొంటూ వెళితే మన మనస్సు కూల్‌గా ఉంటుంది, సమాజం కూల్‌గా ఉంటుంది, మనకు చట్టాలతో అంత పని ఉండదు. మీకు చాలా డబ్బు ఉంది అనుకోండి. అది లోకం చూస్తుంది, మీ కుటుంబసభ్యులు చూస్తారు కాని భగవంతుడు చూడడు. మీకు సమాజంలో గౌరవం ఉంది అనుకోండి. మీకు ఉన్న గౌరవం లోకం చూస్తుంది కాని భగవంతుడు చూడడు. ఈ డబ్బు, అధికారం, గౌరవాలు ఇవన్నీ భగవంతుడి దృష్టిలో చాలా అల్పమైన విషయాలు, స్వల్పమైన విషయాలు. మనం ఏవైతే గొప్ప అనుకొంటున్నామో అవి ఆయన దృష్టిలో కనబడవు, ఆయన ఎక్కౌంటులో అవి ఏమీ ఉండవు. ఇక్కడే మనం పొరపాటు పడుతున్నాము. అయితే భగవంతుడు ఏమి చూస్తాడు. మనకు ధనం ఉండవచ్చు లేకపోవచ్చు, చదువు ఉండవచ్చు, లేకపోవచ్చు. ఇవన్నీ సెకండరీ. మన జీవితవిధానం ఎలా ఉంది, మన ప్రవర్తన ఎలా ఉంది అని భగవంతుడు చూస్తాడు. భగవంతుడిని తెలుసుకోవాలనే కాంక్ష మనలో ఉందా, మనం ఎక్కడ నుండి అయితే వచ్చామో ఆ మూలంలోనికి చేరుకోవటానికి ఏమైనా ప్రయత్నం చేస్తున్నామా అనేది భగవంతుడు చూస్తాడు. మనలో ఉన్న వివేకాన్ని భగవంతుడు చూస్తాడు. ఇది సత్యం ఇది అసత్యం, ఇది నిత్యం, ఇది అనిత్యం, ఇది చేయదగిన పని, ఇది చేయకూడని పని అని ఆ విభజన మన బ్రెయిన్‌లో ఎంతవరకు ఉంది అని భగవంతుడు చూస్తాడు, దానినిబట్టి మార్కులు వేస్తాడు, దానినిబట్టి పునర్జన్మ ఇస్తాడు.

మీకు ఏదైనా డబ్బు ఉంటే దానిని మీ వారసులు తింటారు, ఏదో పదకొండవరోజు ఘనంగా చేస్తారు అంతటితో ఆ దేహయాత్ర ముగిసిపోతుంది. మనందరం బాహ్యవిషయాలకు ప్రాముఖ్యత ఇస్తున్నాము, బాహ్యంగా ఎంత గొప్పగా ఉన్నాము అని చూసుకొంటున్నాము కాని లోపల ఒకవేళ కుళ్ళిపోతున్నామేమో అనేది మనకు తెలియటం లేదు, ఆ విషయం గొడవ మనం చూసుకోవటం లేదు. ఉదాహరణకు మనకు చాలా డబ్బు ఉంది అనుకోండి, గౌరవం ఉంది అనుకోండి, లోపల కుళ్ళిపోతూ ఉంటే ఏమీ ప్రయోజనం లేదు. కొన్ని మామిడిపండ్లు పైకి చూస్తే చాలా బాగా ఉంటాయి, కోసి చూస్తే లోపల కుళ్ళిపోతాయి, కొందరి జీవితాలు కూడా అంతే. నన్ను అందరూ గొప్పగా చెప్పకోవాలి, మంచిగా చెప్పకోవాలి అనుకొంటే అదొక పిచ్చితనం. మీకు మోక్షం ఇచ్చేది సమాజం కాదు, మీలో అంతర్యామిగా

ఉన్న నారాయణుడు మీకు మోక్షం ఇస్తాడు. అందుచేత సమాజం మిమ్మల్ని మెచ్చుకోవటం కాదు, నారాయణుడు మెచ్చుకొనేలాగ మీరు జీవించండి. మనం ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే విభజన మనకు తెలుస్తోందా? ఈ సృష్టిలోనికి మనం వచ్చిన పని ఏమిటి? ఆ పనిని మనం వెంటనే సాధించలేకపోవచ్చు. అసలు దానికి అభిముఖంగా మనం ప్రయాణం చేస్తున్నామా, లేదా అనేది మనం చూసుకోవాలి. మన మార్గం సరిగా ఉంటే మనం సక్సెస్ అవుతాము. ముస్లిములు ఎక్కువగా నిరాకారాన్ని ఆరాధిస్తారు. ప్రతీరూపం, ప్రతీనామం చివరకు దుఃఖం తీసుకొని వస్తుంది అది వారు చెప్పేది. ఆ మాటను మనం అనుసరిస్తున్నామా? ఆ మాటను మనం గౌరవిస్తున్నామా? భగవంతుడిని నేను గౌరవిస్తున్నాను అని చెపుతూ ఆయన చెప్పిన మాటకు విలువ ఇవ్వకపోతే అది గౌరవించటమా? ఇది చేయదగిన పని, ఇది చేయకూడని పని అని గీతలో నిర్ణయించి చెప్పాడు, వీటి విషయాలలో బహుజాగ్రత్తగా ఉండండి. ఆధ్యాత్మిక జీవితానికి భగవద్గీత ఒక గైడ్ లాంటిది. ఆ గైడ్‌ను పట్టుకొని జాగ్రత్తగా ప్రయాణం చేస్తే మనం గమ్యానికి చేరుకొంటాము.

మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రాలేకపోవటానికి కారణం మనలో ఉన్న రాగద్వేషాలు. కుండకు చిల్లులు ఉంటే అందులో మనం నీరు పోసినా ఆ నీరు ఎలా బయటకు పోతుందో అలాగే మనం సాధన చేస్తున్నా సక్సెస్ అవ్వకపోవటానికి మనలో ఉన్న రాగద్వేషాలు కారణం. ఇక్కడ సభ ఏర్పాటు చేసారు, నాకు ఏదో సన్మానపత్రం చదివారు అనుకోండి, నా మనస్సుకు అది తియ్యగా ఉంటుంది. అసలు ఆ సన్మానపత్రానికి నేను అర్హుడినా అనేది నేను చూసుకోను. నా మనస్సు ఆ మాటలలో నుండి ప్లెజర్ తీసుకొంటుంది. ఎప్పుడైతే లోపలకు ప్లెజర్ తీసుకొందో నాకు తెలియకుండా మీ మీద ఇష్టం వచ్చేస్తుంది, అది రాగం కింద మారుతుంది. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తారు అనుకోండి, మైండ్‌కు పెయిన్ వస్తుంది, పెయిన్ వచ్చినప్పుడు అక్కడ ద్వేషం పుడుతుంది. ఏమిటండీ మా మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తోంది అంటారు, దానికి చాలామటుకు రాగద్వేషాలే కారణం. రాగ ద్వేషాలను మనం ఎంతవరకు తగ్గించుకోవాలో అంతవరకు తగ్గించుకొంటేనే మన మనస్సు హృదయం వైపుకు ప్రయాణించి, హృదయంలో అణిగిపోతుంది. ఎవరింటికి వెళ్ళి చూసినా, ఏ ప్రాంతానికి వెళ్ళి చూసినా, ఏ దేశం వెళ్ళి చూసినా ఏముంది ఈ లోకంలో రాగద్వేషములు తప్పించి అన్నాడు గౌతమబుద్ధుడు.

బాహ్యమైన రాక్షసులను జయించటం కష్టమేకాని దేహాభిమానం అనే రాక్షసిలో నుండి

బయటకు రావటం చాలా కష్టం. పెద్దరాక్షసి ఎవరు అంటే మన దేహం మీద మనకు ఉన్న అభిమానమే పెద్దరాక్షసి. మన దుఃఖానికి, అశాంతికి, పునర్జన్మలకు అదే కారణం. ఆ రాక్షసిని జయించి అందులోనుండి బయటపడటానికి స్వప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం ఉండాలి, ఈశ్వరకటాక్షం ఉండాలి. ఇన్ని కలిసి వస్తే గాని దేహాభిమానంలో నుండి బయటపడలేము. ప్రమాదం ఎక్కడ వస్తోంది అంటే మన స్నేహితులు బయట ఉన్నారు, విరోధులు బయట ఉన్నారు, ఆస్తులు బయట ఉన్నాయి, బంధువులు బయట ఉన్నారు, డబ్బు బయట ఉంది, అన్నీ బయటే ఉన్నాయి కాని అహంకారం లోపల ఉంది. అది నీ రూపాన్ని పట్టుకొంటుంది, ఆస్తులను పట్టుకొంటుంది, బంధువులను పట్టుకొంటుంది, అలా పట్టుకొని ఉండిపోతే పరవాలేదు, మీకు తెలియకుండా ఏనుగులాగ పెరిగిపోతూ ఉంటుంది. నాకు ఇంత పొలం ఉంది, డబ్బు ఉంది అని మనస్సులో అనుకొంటాము, అలా అనుకొంటే చాలు దానిని పట్టుకొంటుంది, దాని వలన స్లోగా దేహాభిమానం పెరిగిపోతుంది. ఇది నీకు తెలియదు. అనుకొంటే జీవుడు, అనుకోకపోతే దేవుడు. నువ్వు అనుకోకుండా ఉండలేవు అందుచేత జీవలక్షణాలు పెరిగిపోతూ ఉంటాయి. మీకు సంపద ఉంటే నష్టం లేదు, ఆ సంపదతో తాదాత్మ్యం వలన దేహాభిమానం పెరిగిపోతుంది అది నేను చెప్పేది.

మేము కర్మ అనుభవిస్తున్నాము అని కొంతమంది అంటూ ఉంటారు. కర్మ అనుభవిస్తున్నాము అని మీ అహంకారమే చెపుతోంది. కర్మ ఎక్కడ నుండి వచ్చింది కాశీనుండి వచ్చిందా, సముద్రంలోనుండి వచ్చిందా, ఏమీ కాదు. పూర్వజన్మలో నీవు చేసిన పనులే కర్మ కింద వచ్చి నిన్ను ఇక్కడ పీడిస్తున్నాయి. అది పరాయిది కాదు, ఆ కర్మ నీ సొంతం, నీవు తెచ్చుకొన్నదే అన్న సంగతి నీకు తెలియదు. మీరు ఇక్కడ పరుషవాక్యాలు మాట్లాడితే మరల భగవంతుడు పదిమందిచేత పరుషవాక్యాలు పలికించి మీరు పడేలాగ చేస్తాడు. కర్మ అంటే మీరు పూర్వజన్మలో చేసిందే మీకు వస్తుంది కాని మీకు సంబంధం లేకుండా అది వచ్చి పడిపోదు. అలాగని దాని గురించి తలపెట్టుకొంటూ కృంగిపోవలసిన పనిలేదు. మీరు ఈశ్వరుడి పట్ల భక్తి కలిగి ఉంటే, మీ సాధనాబలం పెరుగుతూ ఉంటే, గురువుఅనుగ్రహం ఉంటే ఆ విధి కూడా కొట్టుకొనిపోతుంది, అక్కడ మీకు ఫ్రీడమ్ ఉంది, గోదావరికి వరద వచ్చినప్పుడు ఆ ప్రవాహంలో పెద్ద పెద్ద దుంగలు కూడా ఎలాగ కొట్టుకొని పోతాయో అలాగ మీ కర్మ అంతా కొట్టుకొనిపోతుంది. భారతయుద్ధంలో కర్ణుడికి శల్యుడు రథసారధ్యం చేసాడు. శల్యుడు ఎటువంటి వాడు అంటే శరీరాన్ని కర్ణుడికి ఇచ్చాడు, మనస్సు పాండవులకు ఇచ్చాడు.

దానినే శల్య సారధ్యం అంటారు. అర్జునుడిమీద ప్రయోగించటానికి నాగాస్త్రం దగ్గర పెట్టుకొన్నాడు కర్ణుడు. నాగాస్త్రం ఎవడిమీద ప్రయోగిస్తే వాడు చనిపోతాడు, దానిని ఎవడూ ఆపలేడు. అర్జునుడి గుండె మీదకు నాగాస్త్రాన్ని గురిపెట్టాడు కర్ణుడు. శల్యుడు కర్ణుడితో ఏమన్నాడు అంటే నీవు బాగా యుద్ధం చేస్తున్నావు కాని అస్త్రాన్ని అర్జునుడి గుండె మీదకు గురిపెట్టావు అలాకాదు వాడి తల మీదకు గురిపెట్టు తలను చీల్చేస్తుంది అని చెప్పాడు. అప్పుడు కర్ణుడు అస్త్రాన్ని అర్జునుడి తలమీదకు గురిపెట్టాడు. అస్త్రం వచ్చేస్తోంది, దానికి తిరుగులేదు, అప్పుడు కృష్ణుడు సడన్‌గా రథాన్ని రెండుఅడుగులు కిందకు తొక్కేసాడు. కృష్ణుడు కర్ణుడికి ఉన్న వరాలను గౌరవించాలి, అర్జునుడిని కాపాడాలి. ఆ అస్త్రం వచ్చి అర్జునుడి కిరీటాన్ని పట్టుకొనిపోయింది. అర్జునుడు బతికాడు, కిరీటం పడిపోయింది. అది పరమాత్మ యొక్క దయ. మేము కర్మ అనుభవిస్తున్నాము అని అలా అనుకోనక్కరలేదు, పరమాత్మ యొక్క దయ ఉంటే, ఆయన పట్ల విశ్వాసం ఉంటే, భక్తి ఉంటే అంతా కొట్టుకొని పోతుంది.

మనం చాలా బుద్ధిమంతులం, మనకు ఏమీ గర్వం లేదు అని అనుకొంటాము. మనకు ఉన్నదంతా గర్వమే. మనకు ఎంత గర్వం ఉంది అంటే భగవంతుడు చెప్పిన మాటలను చదివినా వాటిని నమ్మినట్లు నటిస్తాము కాని అవి నమ్మము. భగవంతుడు అంతర్యామి ఇది అంతా ఆయన చూస్తూ ఉంటాడు. మీరు ఏ మతస్థులయినా, ఎవరి భక్తులయినా చిత్తశుద్ధి లేకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. మన ఆలోచనకు, మాటకు, చేతకు సమన్వయం ఉండదు. చిత్తశుద్ధి లేకుండా ఎన్ని పూజలు, జపాలు, సాధనలు చేసినా ఆత్మజ్ఞానం కలుగదు. ఏమీ పునాది లేకుండా ఇల్లు కడితే ఎలా ఉంటుందో చిత్తశుద్ధి లేకుండా మేము ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వచ్చాము అని చెప్పకోవటం అలాగే ఉంటుంది. ఒకవేళ అభివృద్ధిలోనికి వచ్చినట్లు మీకు కనబడినా, అది నిలబడదు కూలిపోతుంది. చిత్తశుద్ధి అన్నింటికంటే ముఖ్యమైనది. మన నోటి ద్వారా అపశబ్దాలు రాకూడదు, దాని వలన హృదయశుద్ధికి దూరమవుతాము. ప్యూరిటీ లేకుండా పెర్‌ఫెక్షన్ వచ్చే సమస్య లేదు.

ఉన్నది ఈశ్వరుడే. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని చెపుతున్నారు. మరి అదే రెండు కింద, మూడు కింద కనిపిస్తోంది, లోకం కింద కనిపిస్తోంది, ఇదేమి గొడవ అంటున్నారు. ఒక్కటంటే ఒక్కటి అది మనకు అనుభవంలోనికి వచ్చేవరకు అదే రెండు కింద, మూడు కింద కనిపిస్తుంది, అది అనుభవంలోనికి వచ్చాక అది తప్పించి ఏమీ లేదు

అని నీకు తెలుస్తుంది. మనకు తాడు పాముకింద కనిపిస్తోంది అనుకో, తాడు అంటూ ఒకటి ఉంది కాబట్టి అది పాము కింద కనిపిస్తోంది, తాడు లేకపోతే పాము కింద కనబడదు. తాడు తాడు కింద కనిపించాక ఇక నీకు పాము కనబడదు. అది ఏదిగా ఉందో దాని తాలూక ఎరుక నీకు కలిగే వరకూ భయం విడిచిపెట్టదు. అలాగే ఉన్నది ఒక్కటే. అది నీకు రెండుగా, మూడుగా, లోకంగా కనిపిస్తున్నంతకాలం నిన్ను భయం వెంటాడుతుంది. ఉన్నది ఒక్కటే అని నీకు తెలిస్తే ఇంక ఏ గొడవ లేదు. కోరిక, కోపం, భయం తగ్గించుకోండి అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఎందుకు తగ్గించుకోమని చెపుతున్నాడు, అవి ఉంటే నష్టం ఏమిటి? కోరిక, కోపం, భయం ఉంటే కోరిక వెనకాల దుఃఖం ఉంటుంది, కోపం వెనకాల దుఃఖం ఉంటుంది, భయం వెనకాల దుఃఖం ఉంటుంది. ఏది ఉండటం వలన నీకు దుఃఖం వెంటాడుతుందో, అశాంతి వెంటాడుతుందో వాటిని తగ్గించుకోమని భగవంతుడు చెపుతున్నాడు. అవి ఆరిపోతే ఇది కూడా ఆరిపోతుంది.

మనకు పనే భగవంతుడు, నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా, ప్రేమగా చెయ్యి, మిగిలినది భగవంతుడికి వదిలెయ్యి. పని తాలుక ఫలితం గొడవ వద్దు. అది అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. ఆ గొడవ వద్దు. మన డ్యూటీ మనం సక్రమంగా చెయ్యటమే. కోరిక వలన ఏదో వచ్చేస్తుంది అని అనుకోవద్దు. ప్రారబ్దంలో ఉన్నది నీ కోరికతో సంబంధం లేకుండా వస్తుంది, ప్రారబ్దంలో అది లేదు అనుకో నీవు కోరిక పెట్టుకొన్నా రాదు. బంగారపు కొండమీద నీవు దొర్లినా కాసు బంగారం కూడా నీకు అంటుకోదు, చివరకు వళ్ళు నొప్పలు మిగులుతాయి. నీ కోరికను బట్టి అదనంగా ఏదో వచ్చేస్తుంది అని అనుకోవద్దు, అలాగని నీవు చేసే పని మానవద్దు. డ్యూటీ నీ వంతు, ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. నీ పాత్ర నీవు బాగా నిర్వహించు, ఈశ్వరుని పాత్రని నీవు జ్ఞాపకం చెయ్యనక్కరలేదు, ఆయన చేసేది చేస్తాడు, ఫలితం కోసం ఎదురుచూడవద్దు. ఫలితం కోసం ఎదురుచూడకుండా ఉంటే ఫలితం వస్తుంది, చిత్తశుద్ధి కలుగుతుంది. ఏది ఎప్పుడు జరగాలో అది అప్పుడు జరుగుతుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. నువ్వు చేసే కృషి ఏదో నువ్వు చేసుకో. నువ్వు ఎక్కడి నుండి వచ్చావో అక్కడికి వెళ్ళు. బాహ్య పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు సమానంగా ఉంటే మీరు భగవంతుడి దగ్గరకు వెళ్ళనక్కరలేదు, ఆయనే గురురూపంలో వస్తాడు. మన దగ్గర చెడ్డ ఏమిటి అంటే మంచిగురువు దొరికితే బాగుండును అనుకొంటాము కాని మంచి శిష్యుడిగా ఉండాలని

మనం అనుకోము, ఇది పెద్ద పిచ్చి. మంచిశిష్యుడిగా ఉండాలి అనుకొంటే గురువు మీ దగ్గరకు వచ్చి మిమ్మల్ని జ్ఞానంతో అలంకరిస్తాడు. మీ లోపల ఏమి జరుగుతోందో చూసుకోండి. మీకు బాహ్యంగా ఎంత ఐశ్వర్యం ఉన్నా లోపల కుళ్ళిపోతూ ఉంటే ఏమీ లాభం లేదు.

భక్తిని బట్టి జ్ఞానం వస్తుందా, జ్ఞానాన్ని బట్టి భక్తి వస్తుందా అని ఒక లెక్చరర్‌గారు నన్ను అడిగారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే భక్తిని జ్ఞానమాత అన్నారు. తల్లి లేకుండా బిడ్డ రాదు అలాగే భక్తి లేకపోతే జ్ఞానం రాదు అని చెప్పారు. భక్తివలన ఆత్మజ్ఞానం కలుగుతుంది అని ఆచార్యులవారు చెప్పారు. ప్రతీ మనిషికి ఎంతో కొంత స్వార్థం ఉంటుంది. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీ జీవిత యాత్రకు సరిపడ పని ఏదో నీవు చేసుకో అంతేగాని 24 గంటలు స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తే ఆ పనులన్నీ నీ కాళ్ళకు సంకెళ్ళ కింద పడతాయి, పునర్జన్మలను పెంచుతాయి. నువ్వు ఎంతో కొంత సామాజిక దృక్పదంతో పనిచేస్తున్నావు అనుకో దానివలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. భగవంతుడితో అనుసంధానం వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది అని ఆచార్యులవారు చెప్పారు. జ్ఞానం వలన కూడా భక్తి కలుగుతుంది అని నా అభిప్రాయం అని లెక్చరర్‌గారికి చెప్పాను. శ్రీకృష్ణచైతన్యకు జ్ఞానం కలిగాక పరాభక్తి కలిగింది. ఆత్మజ్ఞానం, పరాభక్తి రెండూ సమానమే, అటునుండి ఇటురావచ్చు, ఇటునుండి అటు వెళ్ళవచ్చు, మనం బాగుపడటం ముఖ్యం, వాదనలు అక్కరలేదు అని చెప్పాను. చేసిన మంచి వూరికే పోదు. ఒకవేళ మీరు మంచి చేసి మర్చిపోయినా భగవంతుడు మర్చిపోడు. ఏనాటి అనుబంధమో ఇది, అరుణాచలా అని స్మరించాను అంతే దేహానికి మరణం తీసుకొని వచ్చి మరణానుభవం ద్వారా అమృతానుభవం ప్రసాదించావు అంటారు భగవాన్ అరుణాచలేశ్వరుడితో. నేను యజ్ఞాలు చేసానా, యాగాలు చేసానా అరుణాచలా అని నీపేరు తలపెట్టుకొన్నాను అంతే నా పని పూర్తి చేసేసావు అన్నారు. నిరంతరము పరమాత్మను స్మరించుకోవటం కూడా ఒక యోగమే. ఆ స్మరణ మనలను పవిత్రులను చేస్తుంది, మనలో ఉన్న పవిత్రత మనలను పరమాత్మ పాదాల దగ్గరకు చేరుస్తుంది.

మా పరిస్థితులు బాగున్నాయి అనుకోవటం, పరిస్థితులు బాగా లేదు అనుకోవటం అన్నీ తలంపులే. ఏ తలంపు వచ్చినా తలంపు వెనకాల దుఃఖం వచ్చేస్తుంది. బాహ్య విషయాల నుండి మీరు ఏదైనా ప్లెజర్ తీసుకుంటే ఏదో ఒక రోజున అది పెయిన్ క్రింద మారిపోతుంది. మీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. ఇప్పడు మీరు ఏదైతే సంతోషం, సంతోషం అనుకొంటున్నారో అదే భవిష్యత్‌లో దుఃఖంగా మారిపోతుంది.

ఈ సంతోషమే దుఃఖంగా మారిపోతుంది అని తెలియక దానిని మనం ఎంజాయ్ చేస్తున్నాము, కంచాలు నాకినట్లుగా ఆ ప్లెజర్‌ను నాకుతూ ఉంటాము. మీరు ఏదిగా ఉన్నారో దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం శాంతి. దానిలోనుండి వచ్చే ఆనందం స్వచ్ఛమైనది, అది దుఃఖమిశ్రితం కాదు, అది దేని మీద ఆధారపడి ఉండదు, అది స్వతంత్రమైనది. ఎవరైనా మనతో ఇష్టంగా మాట్లాడినా, ఇష్టంగా చూసినా వారి మీద మనకు ప్రేమ కలుగుతుంది. ఎవరైనా మనతో అయిష్టంగా మాట్లాడినా, అయిష్టంగా చూసినా వారి మీద ద్వేషం కలుగుతుంది అంటే ఇష్టంగా మాట్లాడినా, అయిష్టంగా మాట్లాడినా మన మనస్సు మీద ముద్రలు పడిపోతాయి. ఋషుల దగ్గర అయితే మనం ఇష్టంగా మాట్లాడినా, అయిష్టంగా మాట్లాడినా వారి మనస్సు మీద ముద్రలు పడవు ఎందుచేతనంటే అది మృతమనస్సు, ఆ మాట్లాడేది వాడు కాదని వారికి తెలుసు, అందుచేత దాని ప్రభావం అక్కడ ఉండదు.

మన హృదయంలో ఉన్న వస్తువు తనంతట తానుగా ప్రకాశిస్తుంది, అది ఉండటం వలననే అది తెలియబడుతుంది కాని అది ఉందని ఇంకొకరు చెప్పనక్కరలేదు. ఆ సదా ఉన్న వస్తువు, నిర్మలమైన వస్తువు, నిశ్చలమైన వస్తువు మన ఇంట్లో బంగారం ఉండటం వలన అది తెలియబడదు, మన మనస్సు బంగారం అయితే అది మనకు తెలుస్తుంది. ఇంట్లో ఉన్న బంగారం భోగాన్ని ఇస్తుంది, మనస్సు బంగారం అయితే యోగాన్ని ఇస్తుంది. మేము ప్రాపంచిక మనుషులము, మాకు ఏవో బెంగలు వస్తున్నాయి, ఒక బెంగపోతే ఇంకో బెంగ, ఒక రోగం పోతే ఇంకో రోగం వస్తోంది, మాకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది అని భగవాన్‌ను అడిగితే ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనకు తెలియకుండా ఏదీ జరగటం లేదు అని ఆయన మీద నీకు విశ్వాసం ఉంటే నీ బెంగలు అన్నీ పోతాయి అని చెప్పారు. ముందు భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం కలగాలి, నీవు చేసే సాధన రెండవ పక్షం. భగవంతుడు ఉన్నాడని నమ్ముతున్నాము అంటున్నాడు. నీ నమ్మకం నిజమైతే భగవంతుడి సంకల్పాన్ని ఎందుకు గౌరవించలేకపోతున్నావు అంటున్నారు భగవాన్. భగవంతుడు వేరు, ఆయన సంకల్పం వేరు కాదు. భగవంతుడు ఉన్నాడనే నమ్మకం నీకు ఉంటే ఆయన సంకల్పానికి అనుగుణంగా ఎందుకు ఉండలేకపోతున్నావు అంటే నీకు విశ్వాసం సరిపోవటం లేదు, దీనికి మనలో ఉన్న గర్వం కారణం. మనకు నిజంగా భగవంతుడి మీద నమ్మకం ఉంటే మనం ఇక్కడకు వచ్చినప్పుడు ఎవరూ మనలను గౌరవించకపోయినా, మంచినీళ్లు కూడా ఇవ్వకపోయినా కూడా మనకు ఎర్రచీమ కుట్టినట్లు కూడా ఉండకూడదు,

ఏమీ జరగలేదు అనుకోవాలి. ఇక్కడ మనకు గౌరవం చేయలేదు అనే తలంపు కూడా మనకు రాకూడదు. ఒకవేళ బాగా గౌరవించినా మనస్సులో పొంగురాకూడదు అప్పుడు భగవంతుడి సంకల్పాన్ని గౌరవించినట్లు అవుతుంది. గౌరవించటం ఈశ్వరసంకల్పం, గౌరవించకపోవటం ఈశ్వరసంకల్పం. మంచి జరిగినప్పుడు అది ఈశ్వరసంకల్పం అనుకొన్నప్పుడు చెడ్డ కూడా ఈశ్వరసంకల్పం అని ఎందుకు అనుకోకూడదు. మంచి చెడ్డలు ఈశ్వరుడి కల్పితం కాదు, అవి జీవుడి కల్పితం. ఇష్టాలు, అయిష్టాలు, మంచి, చెడ్డ, లాభం, నష్టం, శత్రుత్వాలు, మిత్రత్వాలు అన్నీ మనో కల్పితములే. మనం ఏదైతే బంగారం అనుకొంటున్నామో అది అంతా డస్ట్. నీకు భగవంతుడు మీద ఉన్న విశ్వాసం నిజమైతే మీ ఇంట్లో ఏదైనా నీకు నచ్చనిది జరిగినా, అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు కదా, ఆయనకు తెలిసే జరుగుతోంది కాబట్టి దానిని మనం అంగీకరించాలి. మరి నీకు దుఃఖం వస్తోంది అంటే ఈశ్వరుని సంకల్పం మీద మీకు గౌరవం లేదు.

కొంతమంది నడుస్తూ చనిపోతారు, కొంతమంది నిద్రలో చనిపోతారు. మనం ఎలా చనిపోవాలో, ఎక్కడ చనిపోవాలో కూడా ఈశ్వరుడు నిర్ణయిస్తాడు, మన ఇష్టం కాదు. నాకు 1987వ సంవత్సరంలో శరీరానికి బాగా జబ్బు చేసింది. పాలకొల్లులో డాక్టర్లు నాన్నగారు మీరు చనిపోతారు, మీకు ఏమి కావాలో అది తినండి అని చెప్పారు. డాక్టర్లు నేను చనిపోతాను అని చెపుతున్నారు నాకు తెలియకుండా లోపల నుండి సంతోషం వచ్చేసేది. అది తప్పు, అలా సంతోషం రాకూడదు, డాక్టర్లు చెప్పిన మాటకు వికారం రాకుండా నేను ఉండలేక పోయాను. భయం వేసేదికాదు, ఇంకా ఉండాలనిపించేది కాదు, చావు కబురు చెప్పగానే సంతోషం వచ్చేది. దుఃఖం ఏవిధంగా అయితే వికారమో, భయం ఏవిధంగా అయితే వికారమో సంతోషం కూడా వికారమే. అంతా భగవంతుడి నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఒక క్షణం ముందుగా వెళ్ళటంకాని, ఒక్క క్షణం లేటుగా వెళ్ళటంగాని మన ఇష్టంకాదు. అది అంతా ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. ఈ లోపుగా మనం తొందరపడకూడదు. ఇంతకాలం బతికాము అని అనుకోకూడదు. ఇంకా ఉండాలి అని అనుకోకూడదు, ఏదీ అనుకోకూడదు, నిర్వికారంగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుని దయకు పాత్రులవుతాము.

ఈశ్వరుడిని కాదని నువ్వు చెయ్యగలిగింది ఏమీ లేదు. ఆయనను కాదని నేనే చేసేయగలను అనుకోవటానికి నీ గర్వం కారణం. నువ్వెవడవు చేయటానికి, అసలు నువ్వంటూ ఒకడవు ఉన్నావా? మనం ఎవరికైనా సహకరించగలము కాని వారిని

ఉద్ధరించలేము. అలా ఉద్ధరించాము అని మనం అనుకొంటే అది మన గర్వానికి గుర్తు. మీకు ఇష్టం లేని సంఘటన జరుగుతున్నా కంగారు పడవద్దు, అవే మీకు అనుకూలంగా మారవచ్చు, దాని వలన మీరు మంచి భవిష్యత్ లోనికి రావచ్చు. మనకేది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు అన్న జ్ఞానం మనకు ఉండాలి. ఈశ్వరుడిపట్ల మీకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే, మీకు సాధనాబలం ఉంటే బలమైన గొఱ్ఱె బలహీనమైన గొఱ్ఱెను ఎలా తరుముకొని పోతుందో అలాగ మీ సాధనా శక్తి, మీ వివేకబలం మీ విధిని తరుముకొని పోతుంది. భగవంతుడిపట్ల విశ్వాసం అట్టిది. అందుచేత నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. భగవంతుడు చెప్పింది మనం వినాలి అనుకోవటం లేదు, మనం చెప్పినట్లు ఆయన వినాలి అనుకొంటున్నాము, మన అహంకారం, మన గర్వం చివరకు అంతదూరం తీసుకొని వెళ్ళింది. భగవంతుడు చెప్పినట్లు మనం వినాలి అనే బుద్ధి ఇంకా మనకు రావటం లేదు, ఆ బుద్ధి మనకు వస్తే మనం భక్తులము అవుతాము. మనం ఏదైతే అసాధ్యం, అసాధ్యం అనుకొంటున్నామో అది భగవంతుడికి సాధ్యమే. భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. మీ దైనందిన జీవితంలో అదృష్టం వచ్చినప్పుడు ఒకలాగ, దురదృష్టం వచ్చినప్పుడు ఒకలాగ కాకుండా భగవంతుడి సంకల్పాన్ని హృదయ పూర్వకంగా, నిండు మనస్సుతో స్వీకరించి ఆయన సంకల్పమే మన సంకల్పం, ఆయన ఇష్టమే మన ఇష్టంగా చేసుకొని జీవిస్తూ ఉంటే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. నమ్మాళ్వారు అంటాడు ఓ పెరుమాళ్ళు! నిన్ను తెలుసుకోకముందు నువ్వు నిజమే, నేనూ నిజమే అనిపించింది కాని ఉన్నది నువ్వే, నేను అసలు లేను అని నిన్ను తెలుసుకున్నాక నాకు అర్థమయింది అన్నాడు.

తులసీదాసుగారు రామాయణం వ్రాసారు, తులసీదాసు గారి హృదయాన్ని మీకు పట్టి చూపించటం కోసం ఈ మాటలు చెపుతున్నాను. కైకేయి రాముడిని 14 సంవత్సరాలు అరణ్యవాసం చేయమంది. ఆ విషయం చెప్పటానికి రాముడు సీత దగ్గరకు వచ్చాడు. నేను కూడా వస్తాను అని సీత చెప్పింది. అరణ్యవాసం నీకు చాలా ఇబ్బందిగా ఉంటుంది, అక్కడ చాలా కష్టం అని రాముడు చెపితే సీతకు ఉద్రేకం వచ్చింది. నువ్వు పైకి పురుషుడిలాగ కనిపిస్తున్నావు కాని ఉన్నది స్త్రీ లక్షణాలు అంది. సింహాసనం పోయింది, అరణ్యవాసానికి వెళ్ళమన్నారు, భార్యతో చెప్పటానికి వస్తే భార్య నోటి ద్వారా ఈ మాటలు వచ్చాయి. ఇన్ని మాటలు పడ్డా, ఇన్ని పరాభవాలు భరించి కూడా ఆయన మొఖంలో ఉన్న ఆనందం, నిర్మలత్వం, నిశ్చలత్వం, ఆ కళ్ళలో ఉన్న కాంతి ఏమీ తగ్గలేదు. ఇన్ని అవమానాలు ఎదురైనా ఆయనలో వికారం

కలుగలేదు. సింహాసనం మీద కూర్చొని రాముడు పరిపాలన చేస్తున్నాడు ఆ రాముడిని నేను ధ్యానం చేయటంలేదు, రావణాసురుడి లాంటి పెద్ద రాక్షసుడిని చంపాడు, రావణాసురుడిని చంపిన రాముడిని నేను ధ్యానం చేయటం లేదు. అనేక అవమానాలు, మాటలుపడ్డాక కూడా ఆయన మొఖంలో వికారం కలుగలేదు, ఆ మాటలు చెవిలో పడకముందు ఎంత ప్రశాంతంగా ఉన్నాడో, ఆ మాటలు విన్నాక కూడా అంత ప్రశాతంగా ఉన్నాడు, మూర్తీభవించిన శాంతి, మూర్తీభవించిన జ్ఞానం, మూర్తీభవించిన సౌందర్యం, అది శాంతి యొక్క పరాకాష్ట, జ్ఞానం యొక్క పరాకాష్ట అట్టి రాముడిని మాత్రమే నేను ధ్యానం చేస్తున్నాను అన్నాడు తులసీదాసు. ఈ ఒక్క వాక్యం మీరు శ్రద్ధగా వినండి, జ్ఞాపకం ఉంచుకోండి, శ్రద్ధగా మననం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-12-2006, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రెలిటివ్ నాలెడ్జ్, ఎబ్‌సల్యూట్ నాలెడ్జ్ అని నాలెడ్జ్‌లో రెండు రకాలు ఉన్నాయి. రెలిటివ్ నాలెడ్జ్ అంటే సాపేక్షిక జ్ఞానం. లెక్కలు, తెలుగు, ఇంగ్లీషు, ఇంజనీరింగ్, మెడిసిన్ ఇలా మన ఇంద్రియాలను ఉపయోగించి మనస్సుతో సంపాదించే జ్ఞానం సాపేక్ష జ్ఞానం. సాపేక్షిక జ్ఞానం వలన మన పొట్ట బాగా వెళ్లిపోతుంది. నెలకో లక్ష రూపాయలు జీతం సంపాదించ వచ్చు, మేడలు కట్టుకోవచ్చు, కారుల్లో తిరగవచ్చు, మీరు పాండిత్యం బాగా సంపాదిస్తే సన్మానాలు చేస్తారు. అక్కడితో ఆఖరు, స్మశానంతో దీనికి ముగింపు. లోకం ఎంత నిజమో, దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో ఈ సాపేక్షిక జ్ఞానం కూడా అంతే నిజం. దీని వలన మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఎబ్‌సల్యూట్ నాలెడ్జ్ అంటే పూర్ణజ్ఞానం, ఆత్మజ్ఞానం, ఆత్మజ్ఞానం ఇంద్రియాల వలన, మనస్సు వలన వచ్చేది కాదు, అది భక్తి వలన, భగవదనుగ్రహం వలన రావాలి. భక్తి లేనివాడికి వైరాగ్యం రాదు. వైరాగ్యం లేనివాడికి ఆత్మజ్ఞానం రాదు. భక్తి వలన, వివేకం వలన, నిష్కామకర్మ వలన, స్వార్థరహితంగా జీవించటం వలన, భగవదనుగ్రహం వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీ ప్రవర్తన చాలా మంచిది అనుకో అప్పుడు అయినా భగవదనుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం రాదు.

జ్ఞానం కావాలి అని పెద్ద సూరమ్మగారు భగవాన్‌ను అడిగారట. భగవాన్ ఏమన్నారు అంటే నీకు జ్ఞానం కావాలి అంటున్నావు. అది సంపాదించేది కాదు. జ్ఞానం అనేది సహజంగా నీ హృదయంలోనే ఉంది. సంపాదించేది అయితే కాలప్రవాహంలో పోతుంది. నీ శరీరంగాని,

నీ ఆస్తులుగాని, నీ పదవులుగాని ఏదీ కాలప్రవాహం ముందు నిలబడవు, అన్నీ కొట్టుకొనిపోతాయి అని వాల్మీకి చెప్పాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీ గుండెలో ఏముందో ఇతరులకు తెలియక పోయినా నీకు తెలుస్తుంది. నీ హృదయంలో ఉన్న చెత్తనంతా బయటకు తోసెయ్యి. ఏ కారణం వలన హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రావటం లేదో ఆ కారణాలను బయటకు తోసెయ్యి. అప్పుడు ఉన్నది ఏదో నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అదే జ్ఞానం, అంతేగాని అది బజారుకు వెళ్ళి డబ్బు ఖర్చు పెట్టి కొనుక్కొనేది కాదు. జ్ఞానం నీలోపలే ఉంది. ఏ కారణం వలన నీకు అనుభంలోనికి రావటం లేదో తడిమి చూసుకో, వాటిని బయటకు గెంటి వెయ్యి. అప్పుడు నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అదే బ్రహ్మం, అదే జ్ఞానం, అదే ఉండటం, అదే ఏకం. ఆ వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినప్పుడు నో మోర్ రీబర్త్, నో మోర్ డెత్, నో మోర్ సారో. మీకు ఏ కారణం వలన అయినా దుఃఖం వస్తోంది అనుకోండి మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. శరీరం ఉండగానే ఎవడైతే దుఃఖరహిత స్థితిని పొందాడో ఇంక వాడికి పునర్జన్మ లేదు.

గ్రామాలను ఉద్ధరించటానికి పనిచేస్తున్నాము, దేశాన్ని ఉద్ధరించటానికి పని చేస్తున్నాము అని చాలామంది చెపుతున్నారు. మరి దేశంలో ఉన్న బాధలు, దుఃఖం అలాగే ఉంది ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే ఓరి పిచ్చివాడా! అహంకారంతో చేసే పని ఎందుకు పనికిరాదు అంటున్నారు. అహంకారం లోపల పెట్టుకొని ఏదో గ్రామాన్ని బాగుచేస్తున్నాను, దేశాన్ని బాగుచేస్తున్నాను అంటే అది నీ అహంకారం పెంచుకోవటానికి కాని ఊరికి ఏమీ ఉపయోగపడదు, దేశానికి ఉపయోగ పడదు. నువ్వు సత్వగుణంతో పని చెయ్యి. అహంకారంతో నువ్వు ఎవరికైనా ఉపకారం చేసినా వాడు సుఖపడడు. నీకూ సుఖం లేదు. సత్వగుణంతో నీవు పనిచేస్తూ ఉంటే అది నీకు సుఖమే, ఇతరులకు సుఖాన్ని ఇస్తుంది. చివరకు సత్వగుణం నిన్ను వదిలేస్తుంది. పడవ మీద నదిని దాటిన తరువాత నువ్వు ఆ పడవను వదిలేస్తావు అలాగే మీకు ఆత్మజ్ఞానం కలుగచేసి ఈ సత్వగుణం మిమ్మల్ని వదిలేస్తుంది. అప్పుడు ఎటుచూసినా జ్ఞానమే, ఎటుచూసినా శాంతే. అప్పుడు మీరు గుణరహితస్థితిని పొందుతారు. ఇతరులకు సహాయం చేసాము అంటారు, సహాయం చేయుటానికి అసలు నీకంటే వేరుగా ఒకడు ఉన్నాడా? ఈ దేహమే నేను అని నువ్వు అనుకోవటం వలన నాకంటే వేరుగా ఇంకొకడు ఉన్నాడు, నాకంటే వేరుగా ప్రపంచం ఉంది అని అనుకొంటున్నావు. నీ దేహానికి జబ్బు చేసింది అనుకో నువ్వు

వైద్యం చేయించుకొంటే ఎవరికైనా సహాయం చేసాను అని అనుకోవు. ఇంకో దేహానికి జబ్బు చేస్తే నువ్వు వైద్యం చేయిస్తే సహాయం చేసాను అనుకొంటున్నావు. అదే పాడుబుద్ధి, అదే వేరుబుద్ధి. నీ లోపల ఉన్న జ్ఞానాన్ని అందకుండా చేసేది ఆ బుద్ధే, అది తొలగించుకోవాలి.

అంత త్యాగం చేసాను, ఇంత త్యాగం చేసాను అంటారు, గొప్పలు చెప్పకొంటారు, అక్కడ నుండి రజోగుణం పెంచుకోవటం, పాడైపోవటం. సబ్జక్టు మీరు బాగా అర్థం చేసుకోవాలి. భగవంతుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ఉండాలి. మేము జపం చేస్తున్నాము, పూజలు చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము, పుణ్యక్షేత్రాలకు వెళ్ళి వచ్చాము, నదులలో మునిగాము అంటే అవన్నీ మంచి పనులు కాదని అనటం లేదు. అవన్నీ చేయండి మంచిదే కాని అంతమాత్రంచేత మీకు మోక్షం వచ్చేస్తుంది అనుకోవద్దు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, వాడికి ఒక సంకల్పం ఉంది, భగవంతుడి సంకల్పాన్ని నూటికి నూరుపాళ్ళు మన సంకల్పం చేసుకోవాలి. భగవంతుడి ఇష్టాన్ని మన ఇష్టం చేసుకోవాలి. భగవంతుడి సంకల్పాన్ని మన సంకల్పం చేసుకోకుండా, భగవంతుడి ఇష్టాన్ని మన ఇష్టంగా చేసుకోకుండా మీరు ప్రాణాయామం చేసిన, ఎన్ని సాధనలు చేసినా, పుణ్యక్షేత్రాలు దర్శించినా మీకు మోక్షం రాదు. ఎందుచేతనంటే మనకు మోక్షం ఇచ్చేవాడు భగవంతుడు. ఆయన సంకల్పానికి విరుద్ధంగా సంకల్పాలు పెంచుకొని, ఆయన ఇష్టానికి విరుద్ధంగా మీరు ఇష్టాలు పెంచుకొని ప్రవర్తిస్తూ మేమేదో ప్రాణాయామం చేసాము అంటే దానివలన మోక్షం రావటం మాట ఎలా ఉన్నా మీకు ఆయాసం మిగులుతుంది. ఇక్కడ కొండ చుట్టూ తిరుగుతున్నాము, మాకు వెంటనే మోక్షం వస్తుందా అని ఎవరో భగవాన్‌ను అడిగారు. మోక్షం మీకు వెంటనే వచ్చినా రాకపోయినా మీరు కొండ చుట్టూ తిరగటం వలన ఆకలి పెరుగుతుంది, పది ముద్దలు ఎక్కువ తినవచ్చు అని చెప్పారు. మీకు మోక్షం ఇచ్చేవాడు భగవంతుడు, ఆయన మీద మీకు నమ్మకం ఉండాలి. ఎవడైతే మనకు జ్ఞానదాతో, ఎవడైతే మనకు మోక్షదాతో వాడి మీద మనకు గౌరవం లేకుండా, వాడిమీద పూజ్యభావం లేకుండా ఏదో ప్రాణాయామం చేస్తున్నాము, మోక్షం వచ్చేస్తుంది అంటే అలా రాదు. అది మనకు అర్థమవ్వటం లేదు. అసలు మనకు సబ్జక్టు అర్థమవ్వటం లేదు, శరణాగతిభావనే మనకు రావటం లేదు. భక్తి అంటే జ్ఞానమాత అని భగవాన్ అనేవారు. భక్తి లేకుండా మనకు జ్ఞానం రాదు. మనకు భక్తి లేదు అనుకోండి, భగవంతుడి మీద మనకు విశ్వాసం లేదు అనుకోండి, ఏదో మన తెలివి తేటల వలన సాధన చేస్తున్నాము అనుకోండి, మన గుండెలో ఉన్న బరువైన రాళ్ళు

అంటే మనలోని బలహీనతలు బయటకు పోవు, ఇవి ఆపరేషన్ చేయించి తీసుకొనేవి కాదు.

రజోగుణం ఉన్నవారు, తమోగుణం ఉన్నవారు చేసే పని నీ కళ్ళకు కనిపిస్తుంది కాని, సహృదయం ఉన్నవారు సద్బుద్ధి ఉన్నవారు, సత్వగుణం ఉన్నవారు, మహాత్ములు చేసే పని నీ కళ్ళకు కనబడదు, అంటే వారు పని చేయటం లేదు అని కాదు, నీ కళ్ళకు అందనంత స్పీడుగా చేస్తారు, ఆ స్పీడును నీ కళ్ళు అందుకోలేవు. వారికి వేరుబుద్ధి లేదు. అహంభావరహిత స్థితిలో ఉన్నవారి ద్వారా పని ఎంత స్పీడుగా జరుగుతుంది అంటే దానిని మీ కళ్ళు పట్టుకోలేవు. బొంగరం చాలా వేగంగా తిరిగేటప్పుడు తిరగటం లేదేమో అని మనకు అనిపిస్తుంది. అలానే అహంభావరహితుడు చేసే పని నీ కళ్ళకు కనబడదు. మిమ్మల్ని ఉద్ధరిస్తాము అని వారు బయటకు వచ్చి ఉపన్యాసాలు చెప్పకపోవచ్చు, వారి సహృదయం, వారి మౌనం, వారి జ్ఞానం ద్వారా శక్తి తరంగాలు వచ్చి మీ మనస్సులో మార్పు తీసుకొని వస్తాయి, అయితే అది మన కళ్ళకు కనబడదు. ఎవడి మనస్సు అయితే ప్రశాంతంగా ఉంటుందో వాడికే లోతైన ఆలోచన ఉంటుంది. ఇప్పుడు మనకు లోతైన ఆలోచనరాదు. మీకు శాంతచిత్తం ఉంది అనుకోండి, అప్పుడు ఒక విషయాన్ని లోతుగా ఆలోచించగలరు. మీ మనస్సును విశ్లేషణ చేసుకోగలరు, మీ మనస్సును పరిశుద్ధం చేసుకోగలరు. ఆత్మను శోధించుకోగలరు. ఇలా ఎప్పుడైతే మన మనస్సు పవిత్రం అయ్యిందో, ఏకాగ్రం అయ్యిందో అప్పుడు ఈశ్వరుడు తనంతట తానే మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీరు ఏదైనా కర్మ సాత్వికంగా చేస్తున్నారు అనుకోండి, వేరుభావన లేకుండా, కీర్తికాంక్ష కూడా లేకుండా మీరు క్వయిట్‌గా, కూల్‌గా చేసుకొంటూ వెళితే మీకు తెలియకుండానే కాలప్రవాహంలో ఈశ్వరుడు మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు, అదే మీ కడసారి జన్మ. మీరు ప్రత్యేకంగా అడగనక్కరలేదు. మనకు అర్హత వచ్చేసింది అనుకోండి మనకు జ్ఞానం ఇవ్వటానికి ఒక్క నిమిషం కూడా ఆయన ఆలస్యం చేయడు. మనకు అర్హత లేదు అనుకోండి, యోగ్యత లేదు అనుకోండి మనం ఎంత అడిగినా ఇవ్వడు, చివరకు నోరు నొప్పి మిగులుతుంది.

అర్జునా! నేను కష్టపడి పనిచేస్తున్నాను కాని పని చేసి నెరవేర్చుకోవలసిన కోరిక అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అయినా నేను పని చేస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. అలా మనం కూడా పని చెయ్యాలి. అలా పనిచేస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. వ్యాసుడు గొప్ప పండితుడు, రచయిత అనుకొంటున్నాము. కృష్ణుడు భగవంతుడు అనుకొంటున్నాము కాని విష్ణుసహస్రనామాలను ధర్మరాజుకు భీష్ముడి చేత చెప్పించాడు.

భీష్ముడి చేత ఎందుకు చెప్పించాడు అంటే భీష్ముడు బాహ్యంగా గొప్ప వీరుడు కింద మనకు కనిపించినప్పటికీ భీష్ముడికి ధర్మశాస్త్రం అంతా బాగా తెలుసు, భగవంతుడి యొక్క వైభవం అయనకు తెలుసు. భగవంతుడి వైభవం భీష్ముడికి తెలుసునని, ధర్మశాస్త్రం ఆయనకు బాగా తెలుసు అని లోకానికి తెలియదు. అందుచేత కృష్ణుడు పన్నాగం ఏమిటి అంటే నేను చెపుతాను అని చెప్పలేదు, వ్యాసుడి దగ్గరకు వెళ్ళు అని చెప్పలేదు, మీ తాతగారి దగ్గరకు వెళ్ళు అని ధర్మరాజుకు చెప్పాడు. తాతగారి యొక్క ఔన్నత్యం మనకు చూపించటానికి చేసిన మాయ అది. తాతగారి మనస్సు పాండవుల దగ్గర ఉండేది, శరీరం కౌరవుల దగ్గర ఉండేది, ఇదంతా కర్మఫలితం, ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అలా జరిగింది. అది ఈశ్వరసంకల్పం. అది జ్ఞానం యొక్క అంతస్థుకు, జ్ఞానం యొక్క వైభవానికి భంగం కాదు చెప్పేవాడు ఆయనే, వినేవాడు ఆయనే, అసలు జ్ఞానికి వేరుభావన లేదు. నేనేదో చెపుతున్నాను, మీరేదో వింటున్నారు అని నేను అనుకొంటే అది నూటికి నూరుపాళ్ళు నా అజ్ఞానమే. నేను చెప్పటం వలన వీరు బాగుపడుతున్నారు అనుకొంటే అది నూటికి నూరుపాళ్ళు అజ్ఞానమే. మనం ఎవరినో ఉద్దరిస్తున్నాము అనుకొంటే అక్కడ మన పతనానికి పునాది పడుతుంది. ఉద్దరించటానికి నువ్వు ఎవడవు? ఒక మనిషి బాగుపడటానికి మనం అవకాశాలు ఇవ్వగలం కాని వాడిని మనం ఉద్దరించలేము.

నీకు ఎప్పుడైతే అమృతానుభవం కలిగిందో ఇంక అప్పుడు వేరుభావన ఉండటానికి అవకాశం లేదు. ద్వైతంలో నుండే కోరిక వస్తుంది, ద్వైతంలో నుండే భయం వస్తుంది, ద్వైతంలో నుండి దుఃఖం వస్తుంది. సర్వ అరిష్టాలకు, సర్వ అనర్థాలకు ద్వైతబుద్ధే కారణం. ద్వైతబుద్ధి వేరుతో సహా నశించినప్పుడే ఆనందం, శాంతి నీకు అందుతాయి, జన్మరాహిత్యస్థితిని పొందుతావు. అక్కడ అది ఉద్దరించాను, ఇక్కడ ఇది ఉద్దరించాను అని ఎన్ని బుడబుక్కల మాటలు నువ్వు చెప్పినా, అహంకారంతో నీవు ఎన్ని పనులు చేసినా, ఎవడైతే అహంభావ రహితస్థితిలో ఉన్నాడో వాడి ద్వారానే లోకానికి ఎక్కువ మంచి జరుగుతుంది. నోటితో బుడబుక్కల మాటలు చెప్ప, అసలు నీవు చేసేటప్పుడు లోపల స్వార్థబుద్ధి పెట్టుకొని చేస్తున్నావా అనేది చూసుకో. నేను దేశాన్ని ఉద్ధరిస్తున్నాను అని చెప్పేటప్పుడు దేశం నీకు ముఖ్యమా, నీ స్వార్థం ముఖ్యమా అనేది చూసుకో. నీ స్వార్థమే ముఖ్యం అయినప్పుడు ఇంక నీవు దేశాన్ని ఉద్దరించేది ఏమిటి? నిజంగా దేశాన్ని ఉద్దరించేవాడు నేను దేశాన్ని ఉద్దరిస్తున్నాను అని చెప్పడు, చెప్పవలసిన అవసరం వాడికి లేదు. మనం పని చెయ్యనప్పుడే బుడబుక్కల మాటలు

అన్నీ చెప్పాలి, నిజంగా చేసేటప్పుడు చెప్పవలసిన పనేమిటి?

ప్రపంచంలో దుఃఖం కనిపిస్తోంది, ఈ ప్రపంచానికి దుఃఖం లేకుండా ఎలా చెయ్యాలి అని అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే లోకంలో ఉన్న దుఃఖం గురించి నువ్వు ఆలోచిస్తున్నావు. ఇంతకీ నువ్వు దుఃఖం లేకుండా ఉన్నావా? అశాంతి లేకుండా ఉన్నావా? నువ్వు దుఃఖంతో, అశాంతితో బాధపడుతున్నావు. నీ దుఃఖాన్ని, అశాంతిని పోగొట్టుకోలేకపోతున్నావు, శవబుద్ధిలో నుండి బయటకు రాలేకపోతున్నావు, ఇంక నీవు ఎవరిని ఉద్ధరిస్తావు. నీకు తినటానికి తిండిలేదు, అన్నసత్రం కట్టిస్తాను అంటావు ఏమిటి? నీకు దుఃఖం లేదు అనుకో పోనీ అప్పుడు లోకంలో ఉన్న దుఃఖాన్ని నువ్వు తీసేయగలవు. నువ్వు అశాంతితో, దుఃఖంతో బాధపడుతున్నావు, ముందు నీ మాట ఏమిటి? నీ దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి ముందు బయటకురా. నీవు దుఃఖంలో నుండి బయటకు వస్తే అసలు ప్రపంచం నాకంటే వేరుగా ఉంది అనే బుద్ధి కూడా పోతుంది, అంత దూరం వెళ్ళిపోతావు. నేను శరీరం లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు, ఇదంతా నీవు కల్పించుకొన్నదే. నీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో అప్పుడు నీవు కల్పించుకొన్నది అంతా పోతుంది. ప్రపంచంలో దుఃఖం లేకపోయినా వీరి దుఃఖమే ప్రపంచం యొక్క దుఃఖంగా కనిపిస్తుంది. ముందు మనం దుఃఖం లేకుండా ఉంటే, అశాంతి లేకుండా ఉంటే మనకంటే వేరుగా ప్రపంచం అంటూ ఒకటి కనిపించదు. నీ లోపల ఉన్న దుఃఖమే, అశాంతే ప్రపంచంలో కనిపిస్తోంది. అందుకే మనవారు అంటారు ధర్మరాజుకు సృష్టిలో ఒక్కడూ చెడ్డవాడు కనబడలేదు, ధుర్యోధనుడికి ఒక్క మంచివాడూ కనబడలేదు అంటే మీ లోపల ఉన్నదే బయట కనిపిస్తోంది, మీలోపల లేనిది బయట ఏమీ కనబడదు. బాహ్యంగా ఎంత యుద్ధం చేసుకొన్నా కొంతమంది అసూయారహిత స్థితిలో ఉంటారు. కర్ణుడికీ, అర్జునుడికీ యుద్ధం జరిగినప్పుడు కర్ణుడు ఒక మాట చెపుతాడు. సవ్యసాచి చేతిలో మరణిస్తే అంతకంటే నాకు గౌరవం ఏముంది అంటాడు. ఈ ఒక్క వాక్యం చాలు వాళ్ళు ఎంత పెద్దవాళ్ళో చెప్పటానికి. కర్ణుడి యొక్క వైభవం తెలుసుకోవటానికి ఈ ఒక్క వాక్యం చాలు. బాహ్యంగా శత్రువుల కింద కనిపిస్తున్నారు, యుద్ధం చేస్తున్నారు. కాని ఎంత విశాల హృదయం ఉంటే ఇతరులలో ఉన్న ఔన్నత్యాన్ని అంగీకరించగలము. గంటల తరబడి, గంటల తరబడి పూజలు చేయటం కంటే కూడా ఒక వాక్యాన్ని బాగా అర్థం చేసుకొంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. ముందు నీవు లోపలకు చూడటం నేర్చుకో. నీకు దుఃఖం ఎందుకు

వస్తోంది, అశాంతి ఎందుకు వస్తోంది అని చూసుకొని, ఏ కారణాల వలన దుఃఖం వస్తోందో ఆ కారణాలను బయటకు లాగి కాల్చి బూడిద చెయ్యి. లోకం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అది ఎక్స్‌రే లాంటిది. లోకం నీలో ఉన్న ప్లస్‌పాయింట్లను, మైనస్‌పాయింట్లను చూపిస్తుంది. నీలో ఏమైనా మైనస్‌పాయింట్లు కనబడితే ప్రయత్నం చేసి వాటిలో నుండి విడుదల పొందు. ఈ లోకంలోనికి వచ్చిన పని అదే. నీలో ఉన్న మైనస్‌పాయింట్లలో నుండి బయటకు రాకుండా ఎవడినో ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి?

ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ ప్రపంచం ఒక ట్రైనింగ్ గ్రౌండ్. మనం ట్రైనింగ్ అవ్వటానికి ఈ లోకంలోనికి వచ్చాము. బాహ్యంగా మీరు ఏదైనా సబ్జెక్టులో ఆల్ ఇండియా టాపర్ అయినా మీకు ఆత్మజ్ఞానం రాదు. మరి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది? మనం రాగద్వేషాలు తగ్గించుకోవాలి. మీరు ఎంతటి వారైనా మీ మనస్సు కదులుతూ ఉంటుంది. మీరు ప్రశాంతంగా ఇంటి దగ్గర కూర్చుని మీ మనస్సు ఎందుకు కదులుతోంది అని మీరు లోపల ఆలోచించండి. మీ మనస్సు కొంచెం కదులుతోంది అనుకోండి, అవి లోకవిషయాలు అవ్వవచ్చు, కుటుంబవిషయాలు అవ్వవచ్చు, మరేదైనా విషయం అవ్వవచ్చు, మీ మనస్సు ఎందుకు కదులుతోంది అంటే అక్కడ ఇష్టం అయినా ఉండాలి, అయిష్టం అయినా ఉండాలి. రోగం అంతా ఇక్కడే ఉంది. యిష్టం ఉన్నచోట మనస్సు కదులుతుంది, అయిష్టం ఉన్న చోట మనస్సు కదులుతుంది. ఈ రెండు ఆపు చేయండి ఇంక మీ మనస్సుకు చాపల్యం లేదు. మీకు ఇష్టం లేదు అనుకోండి, అయిష్టం లేదు అనుకోండి, కోరిక లేదు అనుకోండి, కోపం లేదు అనుకోండి మీ మనస్సును మీరు కదలమని అడిగినా అది కదలదు. మన శరీరానికి బిపి ఉంది, షుగర్ ఉంది, పెరాలసిస్ వచ్చింది, కాళ్ళు నొప్పులు ఉన్నాయి, కళ్ళు మంటలు ఉన్నాయి, చెవులు వినబడవు ఇలా తొంబై రోగాలు ఉన్నాయి అనుకోండి, ఎన్ని రోగాలు ఉన్నా కంగారు పడవద్దు, ఈ శరీరం కాలిపోయినప్పుడు ఆ రోగాలు అన్నీ కాలిపోతాయి. కాని రెండు రోగాలు వల్లకాటిలో కాలవు, అవి నేను అనే బుద్ధి, నాది అనే బుద్ధి, అవి రెండూ పెద్ద రోగాలు. అవి ఆపరేషన్ చేయించి తీయించేసుకొనేవి కాదు. ఈ రోగాల నుండి విడుదల పొందలేము అనుకోండి మనం ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. నేను అనే తలంపు, నాది అనే తలంపు అనే ఈ పెద్ద రోగాల నుండి విడుదల పొందకుండా ఎవరికీ అమృతానుభవం కలుగదు. ఈశ్వరుని అనుగ్రహం లేకుండా ఈ పెద్ద రోగాల నుండి ఏ జీవుడు బయటకు రాలేడు. వాడికి ఎంత డబ్బున్నా, ఎంత అధికారం ఉన్నా, ఎంత చదువు ఉన్నా ఈ రోగాల నుండి బయటకు వస్తే గాని జీవుడు తరించలేడు.

మనం ఇక్కడ సుఖపడటం లేదు, చనిపోయాక ఎక్కడో సుఖపడదాం అనుకొంటాము. ఆ సుఖం ఇక్కడే ఉంది అని తెలియక అలా అనుకొంటాము. ఇప్పుడు సుఖం లేనప్పుడు చనిపోయాక ఎక్కడ సుఖం వస్తుంది. దీపం ఉండగానే నీకు వస్తువు కనబడటం లేదు, ఇంక దీపం ఆరిపోయాక వస్తువు ఎలా కనిపిస్తుంది. నరేన్ నాకు రెండు చేతులు ఉన్నాయి, ఒక చెయ్యి నిత్యం, ఒక చెయ్యి లీల అంటాడు రామకృష్ణుడు. లీల, నిత్యము ఒక్కటే. రెండు చేతులూ నావే. ఇది అర్థం చేసుకొంటే అవతారపురుషులయొక్క వైభవం మనకు తెలుస్తుంది. నీకు నిత్యం ఎంతో లీల కూడా అంతే, లీల అంటే అది నిత్యం యొక్క షాడో. నీకంటే భిన్నంగా నీడ ఉండదు అలాగే లీల కూడా అంతే. ఇది నిత్యం యొక్క షాడో అని మీకు తెలియక పోవటం వలన, ఆ లీలను నిజం అనుకోవటం వలన మీకు దుఃఖం వస్తోంది అని రామకృష్ణుడు చెప్పారు. ఈ లీల మనకు నిజం కింద కనిపిస్తోంది అందుకు మనం ఎంజాయ్ చేయలేక పోతున్నాము. ఇది నిత్యం యొక్క షాడో అని మనకు అర్థమైతే మనం ఎంజాయ్ చేయగలము. గొలుసులో బంగారం తీసివేస్తే గొలుసు లేదు అదేవిధంగా నిత్యం లేకపోతే లీలలేదు. ఒక చెయ్యి లీల, ఒక చెయ్యి నిత్యం అని అంటే దాని అర్థం ఏమిటి అంటే అక్కడ ఎలా ఉన్నానో, ఇక్కడా అలాగే ఉన్నాను, అక్కడ ఎలా పనిచేస్తున్నానో ఇక్కడా అలాగే పని చేస్తున్నాను అంటే పరమాత్మకు, లోకానికి మధ్యన బేధం లేదు ఎందుచేతనంటే లోకం రూపంలో ఉన్నవాడు కూడా పరమాత్మే. పరమాత్మను తీసేస్తే లోకం లేదు. దీని అర్థం ఏమిటి అంటే చనిపోయేవరకూ ఏడుస్తూ కూర్చోవద్దు, సబ్జక్టు అర్థం చేసుకోండి. ఈశ్వరుడికి భిన్నంగా సృష్టి లేదు. వ్యవహారంలో నీకు లాభం రావచ్చు, నష్టం రావచ్చు, ఇదంతా ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. జీవితంలో హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి, అవి నిజం కాదు, వాటిని ఈశ్వరుడే పంపిస్తాడు. వాటిని ఎందుకు పంపుతాడు అంటే నీ మీద కోపం కాదు, వాటి ద్వారా నీవు ట్రైనింగ్ పొందాలి. అది నీకు తెలియక దేవుడిని తిట్టిపోస్తావు. ఒకోసారి మీరు భరించలేనంత ధనం ఇస్తాడు, ఒకోసారి దారిద్ర్యం ఇస్తాడు. ఎందుచేతనంటే అందులోనుండి నేర్చుకోవలసిన పాఠాలు ఉంటాయి. ధనం వచ్చినప్పుడు ఎలా ఉన్నారు, దారిద్ర్యం అనుభవించేటప్పుడు ఎలా ఉన్నారు అని చూస్తాడు. ధనాన్ని మీరు ఇముడ్చుకో గలుగుతున్నారా, లేక అహంకారాన్ని పెంచుకొంటున్నారా అని చూస్తాడు. మీ బ్రెయిన్‌ను ఎలా బేలెన్స్ చేసుకొంటున్నారు అనేది భగవంతుడు చూస్తాడు.

భౌతిక ప్రేమలలో తల్లి ప్రేమ చాలా గొప్పది కాని నీ ప్రేమతో పోల్చినప్పుడు తల్లి ప్రేమ కూడా ఎందుకు పనికిరాదు. సూర్యుడు ఉదయించాక చంద్రుడికి ఎంత విలువ ఉంటుందో ఈశ్వరుడి

ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా అంతే. మనకు జ్ఞానాన్ని ఇవ్వవలసింది ఈశ్వరుడే. మనలను అద్వైతానుభవంలోనికి తీసుకొని వెళ్ళేవాడు ఈశ్వరుడు ఒక్కడు మాత్రమే, అది ఆయనకే సాధ్యం. ఓ అరుణాచలేశ్వరుడా! నా యింటిలో నుండి నన్ను బయటకు తీసుకొని వచ్చావు. బయటకు తీసుకొని వచ్చి నన్ను వదిలెయ్యలేదు, నీ ఇంటిలో స్థానం ఇచ్చావు అంటే శవబుద్ధిని పోగొట్టి శివబుద్ధిని ప్రసాదించావు. నీ అనుగ్రహం ఇట్టిది అని ఎలా చెప్పగలను. అది ఈశ్వరుడి యొక్క వైభవం. మనకు భక్తి లేకపోతే ఏదీ రాదు. కృష్ణుడి యొక్క వైభవాన్ని భీష్ముడు గుర్తించాడు. ఆయనకు భక్తి లేకపోతే గుర్తించలేడు. భీష్ముడి భక్తి ఎంత గొప్పది అంటే కృష్ణుడు బండిచక్రం పట్టుకొని భీష్ముడి మీదకు వస్తూ ఉంటే ఆయన చేతిలో ఉన్న ఆయుధాలను పడేసాడు, నన్ను చంపటానికి నీకు బండిచక్రం కావాలా అంటాడు. అక్కడ ఉన్నవాడు నారాయణుడు అని గ్రహించాడు. నారాయణుడే ఆరూపంలో వచ్చాడు అని భక్తి లేకపోతే గ్రహించటం సాధ్యం కాదు. మీకు లక్ష వేల కోట్ల డబ్బు ఉన్నా భక్తి లేకపోతే అది గ్రహించలేరు.

ఈ మధ్య మేము మద్రాసులో పార్థసారథి కోవెలకు వెళ్ళాము. వివేకానందుడు ఒకసారి మద్రాసులో ఉన్న ఆయన ఫ్రెండ్‌కు ఒక లెటరు వ్రాసాడు. నువ్వు ఎప్పుడైనా పార్థసారథి కోవెలకు వెళుతూ ఉండు. వాడు అర్జునుడికే రథం తోలాడు అనుకోవద్దు. నువ్వు కృష్ణుడిని నమ్మితే నీకు కూడా సారథ్యం వహిస్తాడు. ఆయన ఆవులను కాసేవాడు. ఎప్పుడూ ఆయన కామన్ మేన్‌కు దూరం అవ్వలేదు. అది మనం మర్చిపోకూడదు అని వ్రాసాడు. ఇంకో మాట కూడా వ్రాసాడు. నువ్వు ఆత్మజ్ఞానసముపార్జనకు ఏ రోజున సాధన మొదలుపెట్టావో ఆ రోజునే జ్ఞానం వచ్చేస్తుంది అనుకోకు. నువ్వు చేసే ప్రయత్నం విడిచిపెట్టవద్దు. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఈశ్వరుడు నిర్ణయించుకొంటాడు. నీ చేతిలో ఉన్న పని హృదయపూర్వకంగా చెయ్యి. ఆయన చేతిలో ఉన్న పనిని జ్ఞాపకం చేయనక్కరలేదు. నీకు ఎప్పుడు, ఎలా సహకరించాలో ఆయన సహకరిస్తాడు. నీ జీవిత రథానికి కృష్ణుడిని సారథిగా చేసుకో. కృష్ణుడు చెయ్యమని చెప్పిన పనులు చెయ్యి, ఆయన వద్దని చెప్పినవి మానివెయ్యి. చెయ్యవలసిన పనులు గుర్తుంచుకో అవి చేయటానికి, చెయ్యకూడని పనులు కూడా గుర్తుంచుకో అవి చెయ్యకుండా ఉండటానికి. అది అమృత బోధ, ఆకాశ గంగ, అది వాడికి మానవజాతి మీద ఉన్న ప్రేమ. ప్రపంచాన్ని జ్ఞాని ప్రేమిస్తాడు. అది వాడి నేచర్. జ్ఞానికి ప్రేమించటం సహజం. నీ మనస్సులో ఎన్ని బలహీనతలు ఉన్నా, ఎంత పెంట ఉన్నా నారాయణ స్మరణ చాలు దాన్నంతా కాల్చి బూడిద చేయటానికి అని వ్యాసుడు భారతంలో చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 19-01-07 శుక్ర | పెదకాపవరం, వేణుగోపాలస్వామి గుడి వద్ద (ఆకివీడుకు 8 కి.మీ.) |
| 21-01-07 ఆది | మల్కిపురం, సాయిబాబాగుడి ప్రాంగణం |
| 02-02-07 శుక్ర | తాడినాడ |
| 04-02-07 ఆది | పాలమూరు |
| 07-02-07 బుధ | సఖినేటిపల్లి, గీతామందిరం |
| 11-02-07 ఆది | కాపవరం, గీతాభవనం |
| 16-02-07 శుక్ర | (శివరాత్రి) చించినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**




**కాకినాడ దుర్గాసోము చారిటబుల్ ట్రస్ట్‌లో సద్గురు శ్రీ నాన్నగారు**

# ఆనందమే గురువుగా కనబడతాడు

మనం ఎప్పుడూ పరమాత్మణ్ణి చూడలేదు. మనం చూడని దానిని ప్రేమించలేము. గురువు మీద ప్రేమ పరమాత్ముని మీద ప్రేమ ఒక్కటే. మనం మానవులము కాబట్టి మన ప్రేమకు ఆధారం ఒక మానవుడే ఉండాలి. అదే గురు రూపం. సద్గురువు మీద ప్రేమ అతి ఆనందదాయకంగాను, ఆకర్షణీయంగాను, మైమరపించేదిగాను ఉంటుంది. ఆత్మ ప్రకాశంలో వెలిగే వారి చక్కని సౌందర్యం, మనలను భవసాగరాన్ని దాటించటానికి వారి వైపు ఆకర్షిస్తూ ఉంటుంది. గురువును అర్థం చేసుకోవటం ఎవరి తరం కాదు. వారు అనుగ్రహించిన వారు మాత్రమే వారిని అర్థం చేసుకోగలరు. కన్నులున్నవారు గుడ్డివానికి తన చేతిని అందిస్తే గుడ్డివాడు పట్టుకోగలడు. మనమంతా గుడ్డివాళ్ళమే. గురువు కళ్ళున్న జ్ఞాని. వారు మన అంతరంగంలో అంతా చూస్తూనే ఉన్నారు. మనం మనో వికారాలలో ఉంటాము. అందుకే మనకు పూర్తి విశ్వాసం కుదరటం లేదు. సద్గురువును దర్శనం చేసుకొన్నవారు ధన్యులు. మనస్ఫూర్తిగా గురువు ఎడల నిజమైన ప్రేమ, వారి దర్శనం కోసం నిజమైన తపన ఉన్నట్లైతే ఎన్నో వందల సంవత్సరాలు జపధ్యానాదుల వల్ల కూడా కలుగనంత గొప్ప ప్రశాంతతగా మనస్సు మారిపోతుంది. మనస్సు నిర్మలత్వం చెంది ముక్తి పొందటానికి తరుణోపాయం, సద్గురువునందు నిజమైన ప్రేమ, ఆయన యందు మొక్కవోని నమ్మకం కలగటమే. ఆయనను మానవునిగా తలచకపోవటమే. వేమన అన్నారు "లీవి లేదు టంచు డెందబులో నెంచడు, జ్ఞాని నెరుగలేడు మానవుండు, ఢాంభికునకు లొంగడు" అన్నారు. సద్గురువు ప్రేమ లభించినవాడు నోరుమూత పడుతుంది. బాహ్య నేత్రాలు మూసుకొనిపోతాయి. మనస్సు శాంతితో నిశ్చలమౌతుంది అంతేకాక మనస్సు గురు పాదాలలో లీనమౌతుంది. కాని ఆ ప్రేమ రంగు అద్దటానికి హృదయమనే వస్త్రం పరిశుద్ధంగా ఉండాలి. రోజరు అనే ఆంగ్లేయుడు ఇలా అన్నాడు "మీరు గురువును అంత ప్రేమగా, ఆనందంగా ఎందుకు చూచుకొంటున్నారు. అంటే మిమ్ములను మీరు చూచుకోవటం వల్ల" అని. గురువు బాహ్యంగా మానవాకారం, అంతరంగంలో పరమాత్మ రూపం ఈ నిజాన్ని గుర్తించినవాడు ధన్యుడు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం